దోపిడి దొంగలు!

సంపత్

ఎండ నిప్పులు చెరుగుతూంది. గాలి ఆడటంలేదు.

అదంతా బీడు ప్రాంతం.

కనుచూపు మేరవరకు పిచ్చిగా పెరిగిన పొదలు తప్ప మరేమి కన్పించటంలేదు. బీడు మధ్యగా ఎర్రటి మట్టితో చిన్న మార్గం ఒకటి ఉంది.

ఆ సమయంలో ఒక యువకుడు ఆ దారమ్మట వస్తున్నాడు గుర్రంమీద.

తలపై హేట్ ఉంది. అది ఎగిరిపోకుండా చిన్న తాడు గడ్డం చుట్టూ ఉంది. ఆలివ్ రంగు దుస్తులు అక్కడక్కడ మాసిపోయి, దుమ్ము కొట్టుకొని ఉన్నాయి. ఇన్ షర్టు చేశాడు. నడుముకి తూటాల బెల్టు. నడుముదగ్గర కుడి

వైపున కేస్‌లో రివాల్వర్ వేలాడుతూంది. కాళ్ళకు గట్టి తోలు చెప్పులు.

ఆ గుర్రం చాలా నెమ్మదిగా నడుస్తోంది. ఆ యువకుడు తలఎత్తి చుట్టూ చూశాడు. ఎండకి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. నోరు పిడచకట్టుకు పోతోంది. కనుచూపు మేరలో కొండలు నీలిరంగులో సాక్షాత్కరించాయి.

ఆ యువకుడు సోలిపోయి ఉన్నాడు. దాహంతో నోరు ఎండిపోతోంది. మధ్యమధ్య పెదాలను నాలికతో తడుపుకుంటున్నాడు. గుర్రంకూడా నెమ్మదిగా అడుగులు వేస్తోంది. అతని కళ్ళు భారంగా వాలిపోయాయి. దబ్బున గుర్రంమీద వాలిపోయాడు నిస్త్రాణతో. కాని గుర్రం ఆగలేదు. నెమ్మదిగా అడుగులు వేస్తూనే ఉంది. ఆ యువకుడికి స్పృహపోయింది.

ఇలా సుమారు గంట గడిచింది.

దూరంగా కన్పించిన రెండు, మూడు గాడిదలను చూసి సకిలించింది గుర్రం. ఆ యువకుడికి మెలుకువ రాలేదు.

అక్కడొక పల్లె ఉన్నదనటానికి నిదర్శనంగా దూరంగా ఇళ్ళు కన్పిస్తున్నాయి. ఆ గుర్రం నెమ్మదిగా పల్లెవైపు సాగింది.

ఊరిబయట ఉన్న పెద్ద బావిదగ్గర ఎవరో ఒక యువతి నీళ్ళు చేదుకుంటూంది. దూరంగా గుర్రం రావటం చూసిందామె. తను తెచ్చిన కుండను అలాగే వదిలి, ప్రక్కనే ఉన్న ఇంట్లో దూరింది. కిటికీలో గుండా చూడసాగింది.

ఆ గుర్రం నెమ్మదిగా బావిదగ్గరకు వచ్చి ఆగింది. అటూ ఇటూ చూసి పెద్దగా సకిలించింది.

ప్రక్కనే ఉన్న కుండలో నీళ్ళున్నాయి. మూతిపెట్టబోయింది కాని పట్టలేదు. గట్టిగా నూర్పింది. కుండపగిలి

నీళ్ళు నేలపాలయ్యాయి.

ఇదంతా ఆమె చూస్తూనే ఉంది.

ఆ గుర్రం అక్కడే నిలబడి పోయింది అటూ ఇటూ చూస్తూ.

ఆ యువతి కూడా అయిదు నిమిషాలు అలానే నిలబడి పోయింది గుర్రంవంకే చూస్తూ. గుర్రంమీద వ్యక్తి కనిపిస్తున్నాడు కాని, అతను వాలిపోయి ఉన్నాడు. ఏదో నిర్ధారించుకొని నెమ్మదిగా బయటకు నడిచింది. ఆమెను చూస్తూనే పెద్దగా సకిలించింది గుర్రం. ఆశగా ఆమె వేపుచూడ సాగింది.

దానివైపే చూసి, లోనికి పరుగెత్తి మరో కుండ తెచ్చింది ఆమె. చేది ప్రక్కనే ఉన్న తొట్టి నిండుగా పోసింది నీళ్ళు. ఆత్రంగా తొట్టిలో నీళ్ళు తాగసాగినదా గుర్రం. ఆ యువకుణ్ని నెమ్మదిగా క్రిందకు లాగింది ఆమె. ప్రక్కనే ఉన్న చెట్టు నీడలో పడుకోబెట్టింది. కుండ నిండుగా నీళ్ళుతోడి, ముఖంమీద జల్లింది. కొద్దిగా కదిలాడతను. మరోసారి చల్లేసరికి అతనిలో చలనం కలిగింది.

నెమ్మదిగా కళ్ళు విప్పి చూశాడతను.

ఆమె పరుగెత్తి గుర్రం జీనుకి వేలాడుతున్న నీళ్ళ తిత్తిలో నీరుపోసి అందించింది. ఎత్తి గటగటా తాగేశాడతను. ఆమె అతని వంక చిత్రంగా చూస్తూండి పోయింది.

దాహం తీర్చుకొని ఆమెవంక చూశాడతను. సుమారు ఇరవై మూడేళ్ళు ఉంటాయి ఆమెకి. వయసుకు మించిన శరీరం. ఉబుకుతున్న అవయవాలు, మత్తుగా ఉన్న కళ్లు చాలా సెక్సీగా ఉందా యువతి.

అతను తనవంక అలా పరీక్షగా చూడటం గమనించి

సిగ్గుపడింది ఆ యువతి. కళ్ళు వాల్చుకొని నిలబడింది.

"నా పేరు రాజా! మీ మేలు ఈ జన్మలో మరవలేను. పోయే నా ప్రాణాన్ని, నా గుర్రం ప్రాణాన్ని నిల బెట్టారు" ఆమెవంక కృతజ్ఞతగా చూస్తూ అన్నాడు అతను.

ఆ యువతి మాట్లాడకుండా రోడ్ వైపు చూస్తూండి పోయింది భయంగా. ఆమె చూస్తున్న వైపుకు చూశాడు రాజా.

ఆ పల్లెలో ప్రధానమైన మార్గం అదే. గట్టిగా, చదును చేయబడిఉంది. ఆ మార్గం ఏ వంపుల్లేకుండా తిన్నగా ఉంది. బాట కిరువయిపులా గృహా లున్నాయి. వీధులు కూడా నాలుగయిదు కంటే ఎక్కువలేవు. ఆ ఊళ్ళో అయిదారు వందలకంటే ఎక్కువ గృహాలులేవు.

రాజా పరీక్షగా చూశాడు. ఆ మార్గం అవతలి చివర ఎవరో మార్గం మధ్య నిలబడి వారివంకే చూస్తున్నారు. వారి మధ్య దూరం సుమారు ఫర్లాంగు ఉంది.

రాజా తల త్రిప్పి తనకు సహాయంచేసిన యువతి వైపు చూశాడు. ఆమెకూడా అతని వైపు బెదురుగా ఒకమారు చూసి, చెంగున ముందుకు దూకి నీటికుండలో నీళ్ళు చేదు కొని, మార్గంపై నడవసాగింది తలవంచుకొని.

రాజా లేచాడు నెమ్మదిగా. ఒంట్లో శక్తి వచ్చింది కొద్దిగా. గుర్రం దగ్గరికి నడిచి దాని కళ్ళెం పట్టుకొని, ఆమె వెళ్ళిన వైపు నడవసాగాడు. ఆమె ఆగి, రాజా వంక ఒకసారి చూసి, తిరిగి నడక సాగించింది. రాజా నెమ్మ దిగా గుర్రాన్ని నడిపించుకుంటూ నడవసాగాడు. కొద్ది దూరం నడిచి ఆగిపోయాడు రోడ్ మీద.

అతనికి ఎదురుగా దాదాపు వంద అడుగుల దూరంలో

ఇద్దరు వృద్ధ దంపతులు నిలబడిఉన్నారు. వృద్ధుడి చేతిలో గన్, రాజా వైపు గురి పెట్టబడి ఉంది. రాజాకు నీళ్ళు ఇచ్చిన యువతి వృద్ధురాలి వెనక నిలబడి ఉంది.

రాజా ముందుకు నడిచాడు.

"ఎవర్నువ్?" వృద్ధుడి గొంతు కరుగ్గాఉండి, రాజాని అడిగింది.

"నా పేరు రాజా! మాది రామాపురం!" చెప్పాడు రాజా.

"ఇక్కడికెందుకొచ్చావు?" అధికారం ఉంది ఆ కంఠంలో.

"ఇటువేపు పోతూ వచ్చాను. దారిలో గొంతు ఎండిపోతుంటే మీ అమ్మాయి మంచినీళ్ళు ఇచ్చి నా ప్రాణాలు నిలబెట్టింది. ఆమెకు కృతజ్ఞతలు చెబుదామని ఆగాను" ఆగి చెప్పాడు రాజా.

రెండు క్షణాలు ఆ వృద్ధుడు మాట్లాడలేదు. గన్ సరిగ్గా పట్టుకున్నాడు.

"నువ్వు రామసేన సభ్యుడివా?"

"రామసేనా?" ఆశ్చర్యపోయాడు రాజా. "దాని పేరు విన్నాను. కాని నాకు దానితో సంబంధంలేదు."

"నేను నమ్మను. దానికి నీకు సంబంధం లేకపోతే నీ యీ వేషం ఏమిటి? ఆ తుపాకులు, తూటాలతో పని ఏమిటి?" కర్కశంగా వుంది వృద్ధుడి గొంతు.

ఆ ప్రశ్న వినటంతోనే రాజా కళ్ళు ఎరుపెక్కాయి. పళ్ళు పటపట కొరికాడు.

"ఈ వేషమా? పగ, నా తల్లిని పొట్టన పెట్టుకున్న రాక్షసుణ్ని చంపాలి. అతనికోసం ఊరు, వాడ గాలిస్తున్నాను."

అయిదు నిమిషాలు అలాగే నిలబడి పోయారంతా. చివరకు వృద్ధుడే అన్నాడు. "సరే! నీమాట నమ్ముతున్నాను. యింట్లోకి రా! పిచ్చి వేషాలు వేస్తే ప్రాణాలు దక్కవు. గుర్తుంచుకో!"

అందరు ఇంట్లోకి నడిచారు. రోడ్డు ప్రక్కనే ఉన్న చిన్న పూరిల్లు అది. ముందుభాగాన గుమ్మం, కాని ప్రక్కనే అటూ ఇటూ రెండు కిటికీలు ఉన్నాయి. గుమ్మం చాలా క్రిందగా ఉండటంవలన రాజా హేట్ తీసి, వంగుని లోనికి నడిచాడు. బయటకు చిన్నదిగా కన్పిస్తున్నా, అది పెద్ద రెండు నిట్రాళ్ళ పూరిల్లు. అటువేపు మరోగది ఉన్నట్లు మధ్యలో తడిక ఉంది.

"రా! మంచంమీద కూర్చో!" అన్నాడా వృద్ధుడు.

రాజా మౌనంగా కూర్చున్నాడు. "నా పేరు సీతారామ్. ఆ ముసలిది నాభార్య లక్ష్మమ్మ. ఆమె నా కూతురు సుశీల" తమని తాము పరిచయం చేసుకున్నాడు.

"సరేగాని తాత! ఈ పల్లె అంతా నిర్జనంగా ఉందేమిటి? మీ రొక్కరే కనబడుతున్నారు?" సందేహంగా అడిగాడు రాజా.

సీతారామ్ నిట్టూర్చాడు. "ఆ రామసేన దురాగతాలు మితిమీరి పోయాయి బాబు. ఎక్కడనుంచి వస్తారో పిడుగులాగా వచ్చి పడతారు. అంతా దోచుకుని తగలబెట్టేస్తారు. అయిదు రోజుల క్రితం మా గ్రామాన్ని దోచుకున్నారు. మా అదృష్టం కొద్ది తగలబెట్టలేదు. ఆ దోపిడీలో ఎంతో మందిని చంపారు. ఎంతో మంది యువతులు మానాల్ని కోల్పోయారు."

చెప్పటం ఆపి, కళ్ళు తుడుచుకున్నాడు వృద్ధుడు. అతడి గొంతు జీరపోయింది. మరల ప్రారంభించాడు:

"ఆ దోపిడీ జరిగిన సమయంలో మేమిక్కడ లేము. ప్రక్క ఊరిలో స్నేహితుడి కూతురి పెళ్ళి జరుగుతుంటే వెళ్ళాము. తిరిగివచ్చి చూస్తే ఈ ఘోరం జరిగిపోయి ఉంది. ప్రజలంతా తిండి, బట్టలేక అల్లల్లాడి పోతున్నారు. దానికి తోడు ఈ కరువు. అందుకే బాబు! ఎవరిదోవ వారు చూసుకున్నారు. అందరూ కూడబలుక్కుని ఈ గ్రామాన్ని విడిచి తలోకదేశం వెళ్ళిపోయారు. నేను మాత్రం వెళ్ళలేక పోయాను. అందుకే ఒంటరిగా, అస్తమానం, అనుక్షణం భయపడుతూ ఎవరూ మిమ్మల్ని గమనించకుండా బ్రతుకుతున్నాము."

ఆయన గాథ రాజాలో జాలిని రేపింది.

"సరేగాని రాజాబాబు! ఇందాక ఏదో పగ అన్నావు. ఏమిటని?" అడిగాడు వృద్ధుడు. రాజాకి గతం అంతా లీలగా మెదిలింది కళ్ళల్లో. చెప్పటం ఆరంభించాడు.

2

"సోదరులారా! సాటి గ్రామస్థులారా! ఈ సంవత్సరం ఎంతో మంచిది మనకి. గ్రామదేవత కాళికాదేవి దయవల్ల పంటలు విపరీతంగా పండాయి. కాకపోతే మరేమిటి? ఎల్లప్పుడూ కరువు కాటకాలతో మాడిపోయే మన గ్రామంలో ఈ సంవత్సరం ఇంతగా పండటం నిజంగా కాళికాదేవి మహిమే.అందుకే మనం ముందు అనుకున్నట్లు జాతర జరిపించి, అమ్మవారికి బలులు యివ్వాలి. అందుకు మీరంతా మీ శక్తికొద్ది యివ్వాలి. ఎల్లుండే జాతర!"

గ్రామ పెద్ద గొంతు ఖంగున మోగింది. ప్రజలంతా హర్షధ్వానాలు చేశారు. ప్రతివారి మనసు ఉప్పొంగిపోయింది. అదంతా గ్రామదేవత చలవేనని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా విశ్వసించారు.

ఆ రోజు రాత్రి వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చాడు పొలం నుంచి. అతని భార్య మీనాక్షి, కొడుకు రాజా బయట గుమ్మం దగ్గర నిలబడి ఎదురు చూస్తున్నారు. తండ్రిని చూడగానే రాజా ఆనందంతో ఎదురు పరుగెత్తాడు. వెంకటేశ్వర్లు అతణ్ని ఎత్తుకున్నాడు. రాజాకి అప్పుడు అయిదేళ్ళుంటాయి. చురుకయినవాడు.

ముగ్గురూ యింట్లోకి నడిచారు.

"మీనాక్షీ! భోజనం వడ్డించు" కాళ్ళు కడుక్కుంటూ అన్నాడు వెంకటేశ్వర్లు. మీనాక్షి, రాజాకి, వెంకటేశ్వర్లుకి వడ్డించింది భోజనం.

"ఏమండి!" చిన్నగా అంది మీనాక్షి.

"ఏమిటి!" అన్నం కలుపుకుంటూ అన్నాడు వెంకటేశ్వర్లు.

"కాళికాదేవి దయవల్ల మన కష్టాలు గట్టెక్కాయి. నేను ఒక మేకపోతును బలియిస్తానని మొక్కుకున్నాను."

"అలాగే!" అన్నాడు వెంకటేశ్వర్లు.

మూడో రోజు సంరంభాలు ప్రారంభమయ్యాయి. ఉదయమే లేచి కార్యక్రమాలు ప్రారంభించారు. పల్లె ప్రజలంతా ఏకమై తమ సంతోషాన్ని, కృతజ్ఞతను వ్యక్త పరుచుకుంటున్నారు.

సరిగ్గా అదే సమయంలో ఎవరో ఒకడు పరుగెత్తుకుంటూ వచ్చి, గ్రామ పెద్ద చెవిలో ఏదో చెప్పాడు. ఆయన ముఖం వెలవెల పోయింది. సంరంభాలు ఆపించి అందరితోను ఆ వార్త చెప్పాడు. అంతా కళవళపడ్డారు అది విని. వెంటనే జాతర ఆగిపోయింది.

"అంతా మల్లుగాడి ముఠాని ఎదుర్కోవటానికి సిద్ధపడండి."

ప్రజల్లో కలవరం పెరిగిపోయింది. ఊరిలోని మగ వాళ్లు, యువకులు, వృద్ధులనే తేడా లేకుండా బరిశలు, గొడ్డళ్ళు తీసుకొని తయారయ్యారు. ఆడవాళ్ళు, పిల్లలు ఇళ్ళల్లో దాక్కున్నారు భయంతో.

మధ్యాహ్నం అయ్యేసరికి మల్లుగాడి ముఠా వచ్చిపడింది ఊరిమీద. ఆ ముఠాలో మొత్తం అరవై మందివరకు ఉన్నారు. మోటుగా, దున్నపోతుల్లా ఉన్నారు. దయా దాక్షిణ్యాలనేవి లేవు వారికి. పైగా మోటు తుపాకులున్నాయి వారి దగ్గర. గుర్రాలమీద వొచ్చి పడ్డారు.

వచ్చీ రావటంతోనే పెద్దగా కేకలు వేస్తూ జనం మీద పడ్డారు. ముందే తయారుగా ఉన్న ఆ ప్రజలు ఎదురు తిరిగారు. పోరు భయంకరంగా సాగుతోంది. గుర్రాలు ఎక్కి ఉన్న వారిని పడగొట్టటం సులభం కాదు. ఎదురు తిరిగిన వారిని ఊచకోత కోశారు వారు. మోటు తుపాకులతో తలలమీద బాదుతూ, కాలుస్తూ, గుర్రాల చేత తొక్కిస్తూ మల్లుగాడి ముఠా విజృంభించింది.

పోరు ఘోరంగా సాగింది. నాలుగయ్యేసరికి అందరూ హతమయ్యారు. అలా చనిపోయిన వారిలో వెంకటేశ్వర్లొకడు. యింట్లో ఉన్న మీనాక్షి గుండె గుబులుగా ఉంది. రాజాని గుండెల కదుముకొని ఒక మూలగా ఒదిగి కూర్చుంది.

ఆ క్షణంలో బయట హాహాకారాలు చెలరేగాయి. ఆడవాళ్లు, పిల్లల ఏడ్పులతో ఆ ప్రదేశం దద్దరిల్లిపోయింది. మల్లు ముఠా దొరికిన ఆయుధంతో చంపేస్తున్నారు వారిని. ఇంతలో ఎవరో ఇళ్ళకు నిప్పు అంటించారు. క్షణాలమీద అంటుకుంది ఊరు. అన్నీ పూరిళ్ళు కావటం వలన, వాయుదేవుడితోడ్పాటు ఉండటంతో అగ్ని దేవుడు

విజృంభించాడు.

మల్లుగాడి ముఠా ఇళ్ళల్లోకి చొరబడి దొరికిన ధాన్యం, విలువయిన వస్తువులు బయటికి చేరవేస్తున్నారు.

మీనాక్షి భయంతో తలుపు తెరిచి బయటకు రాబో యింది. ఇంతలో ఎవడో లోనికి ప్రవేశించాడు ఆమెని నెట్టుకుంటూ. మీనాక్షి అదిరిపడింది. ధాన్యంకోసం లోనికి ప్రవేశించిన ఆ రాక్షసుణ్ని మీనాక్షి అందం రెచ్చగొట్టింది. వికటంగా నవ్వుతూ ఆమెని సమీపించాడు.

"రాజా! నువ్వు వెళ్ళి ఆ ప్రక్క గదిలో దాక్కో" అరిచింది మీనాక్షి. రాజా పరుగెత్తాడు. ఆ రాక్షసుడు మీనాక్షి చేతులు పట్టుకున్నాడు. విదిలించి కొట్టింది మీనాక్షి. అయినా వదల్లేదు. భయంకరంగా నవ్వుతూ ఆమెని గట్టిగా ఒడిసి పట్టుకొని, కౌగిలిలోకి లాక్కున్నాడు. మీనాక్షి అతన్ని కొరికింది. అవి అన్నీ అలవాటే అయి నట్లు అతని పట్టు ఏమాత్రం సడలలేదు. మీనాక్షి కట్టు కున్న చీర, రవిక పీలికలయిపోయాయి. వాడి చేతుల్లో విలవిల లాడుతోందామె.

ఇదంతా చూస్తూనే ఉన్నాడు రాజా తలుపు చాటు నుంచి. ఆ పసిమనస్సులో ఆవేశం పెల్లుబికింది. చేతిలోకి దొరికిన చిన్న చెక్కను పట్టుకొని ఆ గదిలో ప్రవేశిం చాడు. మీనాక్షిమీద ఉన్న అతడి తలమీద బాదాడు గట్టిగా శక్తికొద్దీ. అతడు ఉగ్రుడైపోయాడు. మీనాక్షిని వదలి, రాజాని రెండు చేతులతో ఎత్తి గదిమూలకు విసి రాడు. దెబ్బ తగిలింది గట్టిగా. అంతే స్పృహ కోల్పో యాడు రాజా.

స్పృహ వచ్చేసరికి, చిరిగిన పీలికలతో, కొన ఊపిరితో

ఉన్న తల్లి రూపం కన్పించింది. రాజా ఆమె దగ్గరకు పోశాడు. "అమ్మా!" అన్నాడు పెద్దగా. నెమ్మదిగా కళ్లు తెరిచి చూసిందామె.

"నాయనా! రాజా! నేను చనిపోతున్నానురా, మీ నాన్నగారితో బాటే. నిన్ను ఒంటరివాణ్ని చేసి మేము వెళ్ళిపోతున్నాము. నువ్వు తాతయ్యగారింటికి వెళ్ళు."

"అమ్మా!" అరిచాడు రాజా.

"ఇక బయటికిపో బాబు! యిల్లు అంటుకుంది. త్వరగా పారిపో!"

రాజా పరుగెత్తాడు బయటికి. అదే క్షణంలో యిల్లు అంటుకొని భగ్గున మండసాగింది. "అమ్మా!" పిచ్చిగా అరిచాడు రాజా.

3

చెప్పడం ఆపాడు రాజా. అతని కంఠం జీరవోయింది.

"తరవాత?" ప్రశ్నించాడు సీతారామ్.

"ఆ తరవాత నేను మా తాతగారి ఊరు చేరాను. ఆయన దొరల దగ్గర పనిచేస్తుండే వారు. ఆయనే నా చదువుసంధ్యలు చూశారు. కానీ నాలో ఆ పగ మాసి పోలేదు. ఏనాటికయినా వాణ్ని నాశనం చేసి తీరుతాను" ఉద్రేకంగా అన్నాడు రాజా.

"ఎలా రాజా! యిరవై సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడతన్ని నువ్వు గుర్తు పట్టగలవా? అసలతను ఉన్నాడో లేదో నీకు తెలియదుగా?"

"లేదు తాతా! నాకతని రూపం బాగా గుర్తే. నీ వన్నట్లు వాడు చనిపోయి ఉంటే చాలా అదృష్టవంతుడు. బతికుంటే చిత్రహింసలు పెట్టి చంపుతాను" పళ్ళు కొరి కొరికాడు రాజా.

"నన్ను క్షమించు బాబు! నీ గతమంతా గుర్తుచేశాను. సరేగాని సుశీలా భోజనం వడ్డించమ్మా!" అన్నాడు సీతారామ్.

ఆకలిమీద ఉండటం వలన బాగా భోజనం చేశాడు రాజా. మిక్కిలి బడలికగా ఉండటం వలన ముందు గదిలో మంచంపై పడుకున్నాడు. గాఢంగా నిద్రపట్టిం దతనికి. ఎంత సేపు నిద్రపోయాడో తెలీదతనికి.

"ధన్ ...ధన్ ...ధన్."

ఉలిక్కిపడి లేచాడు రాజా. చీకట్లు కమ్ముతున్నాయి. నడుం దగ్గర కేస్‌లో రివాల్వర్ ఉందో లేదో ఓమారు చూసుకొని, బయటికి నడిచాడు.

బయట సీతారామ్, డబుల్ బారల్ గన్‌తో నిలబడి ఉన్నాడు. దానినుంచి పొగలు వస్తుండటం స్పష్టంగా కన్పిస్తూంది. అప్పటికే లక్ష్మమ్మ, సుశీల బయటకు చేరి ఉన్నారు.

"ఏమయింది?" బయటకు వస్తూ అన్నాడు రాజా.

సీతారామ్ మాట్లాడలేదు. మార్గం వైపు చూస్తూండి పోయాడు. అటువేపే దృష్టిని సారించాడు రాజా.

రోడ్ మీద కొద్ది దూరంలో ఎవరో పడిపోయి ఉన్నారు. దూరంగా గుర్రం పరుగెడుతూ కన్పించింది. రాజా ఆ వ్యక్తి దగ్గరకు నడిచి, పరీక్షించాడు. అతని ప్రాణం ఎప్పుడో పోయింది. చేతిలో చిన్న తుపాకీ ఉంది.

"తాతా! యితను రామసేన మనిషా?" ప్రశ్నించాడు రాజా.

"అవును రాజా!"

"మళ్ళీ ఎందుకొచ్చాడు? యిక్కడెవరూ లేరని

తెల్సుగా?"

"తెలియదు బాబు. గుర్రంమీద యిటు వస్తూ కన్పించాడు. నేనూ అతన్ని తప్పించుకు పోదామనే ఉద్దేశంతో చాటుకి పోబోయాను. కాని నన్ను గమనించి తుపాకీ తీశాడు. నేను కాల్చాను."

రాజాకి చాలా ఆశ్చర్యంగా ఉంది. అరవై ఏళ్లైనా ఆ వృద్ధుడిలో పటుత్వం తగ్గిపోలేదు. అతనివంక ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు.

సుశీల, లక్ష్మమ్మ ఆ చనిపోయిన వ్యక్తి వైపు భయంగా చూస్తూండి పోయారు.

"ఇవ్వాళ కాకపోయినా రేపయినా ఆ రామసేన ముఠాకి ఈ సంగతి తెలిసిపోతుంది, తమ సభ్యుడొకడు మాయమయ్యాడని. ఇతని శవం యిక్కడ కన్పిస్తే ప్రమాదం. తాతా! మరి యిప్పుడేం చేద్దాం?"

సీతారాం మాట్లాడకుండా హతుడి శరీరం ప్రక్కకు లాగి, తుపాకి, నడుముకున్న తూటాల బెల్టు తీసేసి, అతని డ్రస్సు విప్పాడు. రాజా అతను చేస్తున్నది ఆశ్చర్యంగా చూ స్తుండిపోయాడు.

"రాజా! నీ గుర్రాన్ని ఒకసారి యివ్వు!" అన్నాడు.

"నా గుర్రమా? యింత ముసలివారు మీరు, స్వారీ చేస్తారా!" ఆశ్చర్యపోయి అడిగాడు రాజా. సీతారామ్ నవ్వాడు. "నాకు చిన్నప్పటినుంచి గుర్రపుస్వారీ వచ్చు బాబు" అన్నాడు.

సీతారామ్ మృతశరీరాన్ని తాళ్ళతో కట్టి, ఆ తాడును గుర్రం జీనుకి కట్టాడు. గుర్రం ఎక్కి ముందుకు దూసుకు పోయాడు. అతనితోపాటే శవం కూడా మార్గంమీద ఈడ్వబడుతూ వెళ్ళిపోసాగింది.

కన్పించినంత మేరచూసి, లోనికి నడిచాడు రాజా. రాత్రి అయ్యింది. వెన్నెల కాస్తోంది. భోజనం ముగిస్తుండగా వచ్చాడు సీతారామ్.

"ఏం చేశారా శవాన్ని?" అడిగాడు రాజా.

"దూరంగా చిన్న లోయ ఉంది కొండప్రక్కనే. దాంట్లో పడవేసి వచ్చాను."

రాజా బయటికి నడిచి, గుర్రం దగ్గరకు నడిచాడు. అది ప్రక్కనే ఉన్న చిన్న కొయ్యకి కట్టివేయబడి ఉంది. గుర్రానికి దాణా వేశాడు రాజా.

"రాజా! ఈ ముందుగదిలో మంచం మీద నీవు పడుకో. మేము ఆ వెనక గదిలో సర్దుకుంటాము" అన్నాడు వృద్ధుడు.

రాజా వద్దని వారించ బోయాడు. కానీ అతడు అంగీకరించలేదు. రాజాకి ఒప్పుకోక తప్పింది కాదు. దాణా వేసి లోనికి వచ్చాడు. సుశీల మంచంమీద బట్టలు పరుస్తోంది. అమాయకమయిన ఆమె ముఖాన్ని చూస్తూ నిలబడి పోయాడు రాజా. ఇరవై ఏళ్ళ అందగత్తె ఆమె. అవయవాలన్నీ పొందిగ్గా అమర్చబడి ఉన్నాయి. ఆమెను చూస్తున్నకొద్ది రాజాలో ఉద్రేకం కలగసాగింది. తనని తాను తమాయించుకున్నాడు.

ప్రక్క సిద్ధపరచి, వెళ్ళబోతు వెనక్కి తిరిగింది సుశీల. రాజా కన్పించగానే ఉలిక్కిపడింది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి ఒక్క క్షణం.

"రాత్రికి వస్తాను. మేలుకొని వుండండి."

చిన్నగా గుసగుస లాడుతున్నట్లు అని వెళ్ళిపోయింది ఆమె.

అదిరిపడ్డాడు రాజా! తనతో ఏంపని ఆమెకి? ఒంటరి

ఆడపిల్ల రాత్రిపూట ఓ పరాయి మగవాడి దగ్గరకు రావటం? ఆలోచనలు మాని పడుకున్నాడు రాజా. మధ్యాహ్నం నిద్ర పోవటం వలన నిద్ర రావటం లేదు. సుశీల కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

సుమారు పదకొండు గంటలవుతుండగా వచ్చింది సుశీల. తెల్లటి చీర, అక్కడక్కడ చిరిగిపోయి, మాసికలు వేయబడి ఉంది. ముఖం అమాయకంగా, స్వచ్ఛంగా ఉంది.

ఇద్దరు చప్పుడు కాకుండా బయటికి నడిచారు. పిండార బోసినట్లున్న వెన్నెలలో వాతావరణం ఆహ్లాదంగా ఉంది. నిర్జనంగా కన్పిస్తున్న పల్లె భయాన్ని కలిగిస్తోంది.

ఇద్దరు ఊరి చివరకు చేరుకున్నారు. బాట పక్కనే గడిలో చతికిల బడ్డారు. "ఇంత సాహసం చేసినందుకు నన్ను మన్నించండి!" సుశీల తల వంచుకొని అంది.

"సుశీలా! మీతో ఒకమాట చెబుతాను వింటారా?"

"మీరేం చెబుతారో నాకు తెలుసు."

సిగ్గుతో తల మునకలవుతూ అంది సుశీల.

"నన్ను పూర్తిగా చెప్పనియ్యి సుశీలా! యిన్నాళ్ళ వరకు నా తల్లిని నాశనంచేసి, ఆమె మరణానికి కారకుడైన వాడిని మట్టుపెట్టటమే నా పరమావధిగా ఉండేది. ఆ ఆశయంతోనే పిస్టలు కాల్చటం, గుర్రపుస్వారి, కర్ర సాము మొదలైన విద్యలు నేర్చుకున్నాను. ఆ ఆశయం తోనే నేనిన్నాళ్లు జీవించాను. నిన్ను చూడగానే నాకూ కోరికలున్నాయని, నిన్ను పెళ్ళి చేసుకొని ఆనందం పొందాలని భావించాను. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నీకిష్టమయితే పెళ్ళి చేసుకుంటాను" ఆవేశంగా అన్నాడు రాజా.

"నన్ను పెళ్లాడతాననటం నా అదృష్టం. కాని ఎన్నాళ్ళు ఈ నరకంలో బ్రతకటం?" నిరాశగా అంది సుశీల.

"నరకమా?" ఆశ్చర్యపోయాడు రాజా.

"కాదా మరి? ఎవరూ లేని ఈ ఊళ్ళో, ఒంటరిగా, దొంగచాటుగా బ్రతుకుతూ, ఏ క్షణంలో రామసేన మీద పడుతుందో భయపడుతూ బ్రతకటం నరకం కాక మరేమిటి? బహుశా ఆ రామసేన ముఠాలోనే మీకు కావల్సిన వ్యక్తి ఉన్నాడేమో?"

రాజా కళ్ళు ఎర్రబడ్డాయి. కోపంతో పిడికిళ్ళు బిగించాడు.

"ఇప్పుడే బయలుదేరండి. ఆ రామసేన ముఠాని నాశనం చేయండి. నాకెందుకో మీరే ఆ పని చేయగలరనిపిస్తోంది. ఆ ముఠాలో మీకు కావలసిన వ్యక్తి లేకపోయినా ఫరవాలేదు. ప్రజల్ని పీడించే ఒక ముఠాని నాశనం చేశారన్న ఖ్యాతి దక్కుతుంది" ఆవేశంగా అంది సుశీల.

"సుశీలా! యికనుంచి ప్రతిక్షణం నేను ఆ ప్రయత్నం నిర్వర్తించడంలోనే ఉంటాను. నన్ను నమ్ము" ఆవేశంగా, సుశీల చెయ్యి తన చేతిలోకి తీసుకొని ప్రమాణంలా చేస్తూ అన్నాడు రాజా.

కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు. అంతసేపు సుశీల చేయి, రాజా చేతిలోనే ఉంది.

"ఇక లేవండి వెళ్దాం" లేచినిలబడి అంది సుశీల.

రాజా ఆమెవంక చూశాడు. వెన్నెల్లో వెలిగిపోతూంది వెన్నవలె ఆమె. చటుక్కున ఆమె చేయి పట్టుకొని క్రిందికి లాగాడు. సుశీల విసురుగా వచ్చి అతని కౌగిలిలో పడింది. తెల్లబోయింది సుశీల. తేరుకునే

లోపునే రాజా చేతులు ఆమె వీపుని చుట్టివేశాయి. అతని పెదాలు, ఆమె పెదవులను అదిమి పట్టాయి. అతన్ని ఘట్టిగా కౌగలించుకుంది సుశీల.

4

ఉదయాన్నే బయలుదేరాడు రాజా గుర్రం ఎక్కి.

"సీతారాంజీ! మీ ఆతిథ్యం మర్చిపోను. అంతేగాదు తిరిగి వచ్చేటప్పుడు మీకో శుభవార్త తెస్తాను" అన్నాడు రాజా. అతని కళ్ళు సుశీలకోసం వెదికాయి. కాని ఆమె కన్పించలేదు. నిరాశగా కాలిబూటుతో గుర్రం డొక్కలో తన్నాడు. ఎర్రమట్టిదుమ్ము రేపుకుంటూ ముందుకు పరుగెత్తింది వేగంగా అది కొండలవైపు. తిరిగి తిరిగి సుశీల కోసం వెనక్కి చూస్తూ వేగంగా స్వారిచేయసాగాడు. వృద్ధ దంపతులు గుడిసె లోపలికి వెళ్ళిపోయారు.

వేగంగా వెళ్ళిపోతున్న రాజా ఎవరో కేక వేయటంతో కళ్లెం పట్టుకొని గుర్రాన్ని ఆపాడు. వెనక్కి తిరిగి చూశాడు. సుశీల రొప్పుతూ పరుగెత్తుకు రావటం కన్పించింది. రాజా ముఖం ఆనందంతో వెలిగిపోయింది. గుర్రం దిగి నిలబడ్డాడు రాజా. సుశీల పరుగెత్తుకుంటూ వచ్చి రాజాకి ఎదురుగా నిలబడింది. ఆయాసంతో నోట మాట రావటంలేదు. గుండెలు ఎగసి ఎగసి పడుతున్నాయి.

"సుశీల! ఎక్కడికి వెళ్ళావు? నీకోసం ఎంతగా చూశానో తెలుసా?" ఆనందంతో అన్నాడు రాజా. సుశీల తేరుకుంది ఆయాసంనుంచి.

"మీ కోసమే యిందాకట్నుంచి ఆ పొదచాటున ఉన్నాను. ఇవిగో! మీ కోసం తయారుచేసి తెచ్చాను" అంటూ గుడ్డలో మూటకట్టి ఉన్న చపాతీలను అందించింది. వాటిని అందుకున్నాడు రాజా.

"వస్తాను సుశీలా! నీకిచ్చిన మాటప్రకారం ఆ రామసేన మతాని నాశనంచేసి వస్తాను" ఉత్సాహంగా అన్నాడు రాజా.

"నువ్వు త్వరలో తిరిగిరావాలని భగవంతుణ్ని కోరు కుంటున్నాను రాజా!"

రాజా గుర్రం ఎక్కబోయాడు.

"రాజా!" అంది సుశీల తలవంచుకుని. ఎక్కబోయి ఆగాడు రాజా. "ఏమిటి సుశీలా?" అని ప్రశ్నించాడు.

"రాత్రి నువ్వు నాకు ఇచ్చింది ఇవ్వాలనుకుంటున్నాను" అంది.

"రాత్రి నీకు ఇచ్చానా?" ఆశ్చర్యబోతూ అడిగాడు రాజా. ఆమెకేమి ఇచ్చినట్లు గుర్తులేదతనికి. "ఏమిటది!" అన్నాడు.

"ఇది" చటుక్కన అతన్ని కౌగలించుకుని, వీపుచుట్టు చేతులేసి అతన్ని అదుముకుని అంది సుశీల. అతని పెదాలపై ముద్దుపెట్టుకుని, అతన్ని వదిలి పరుగెత్తింది వెనక్కి.

రాజా ఉలిక్కిపడ్డాడు. అతని హృదయం ఆనందంతో గంతులు వేసింది. సుశీల కనుమరుగయేంతవరకు చూసి, ఉత్సాహంతో తిరిగి గుర్రాన్ని ఎక్కి అదిలించాడు. ముందుకు దూసుకుపోసాగింది అది కొండలవైపుగా.

ఆ కొండల అవతల సుమారు మూడు నాలుగు మైళ్ళ దూరంలో మరొక పల్లె ఉంది. ఆ కొండ మార్గం తప్ప మరో మార్గంలేదు అటువైపు వెళ్ళటానికి. మధ్యలో కొండలబారు ఉంది అడ్డంగా. ఆ కొండలలోని మార్గం అయినా సులువుగా ఉండదు. అంతా ముళ్ళు, పొదల మయం. మధ్యలో లోయ. ఆ లోయలో చిన్న సెలయే రొకటి ప్రవహిస్తుంటూంది. ఆ సెలయేరులో తప్పితే

ఆ చుట్టుప్రక్కల కొండలలో మరి నీళ్ళు దొరకవు. అందు చేతనే కాస్త కష్టంగా ఉన్నా ఆ కొండ మార్గాన్నే అందరూ ఉపయోగిస్తుంటారు.

రాజా గుర్రం అతిత్వరగా పరుగెడసాగింది. ఇప్పుడు రాజా దొక్కటే ధ్యేయం. రామసేనను హతమార్చాలి. అందులో తప్పకుండా తనకు కావాల్సిన మనిషి ఉంటాడు.

ఇంతలో కొండల దాపుల్లోకి వచ్చింది గుర్రం.

ఆ కొండలబారుని పరిశీలించి, సీతారామ్ తనకు చెప్పిన దారిని సులభంగానే గుర్తుపట్టాడు. ఆ కొండ చాలా ఏటవాలుగా ఉంది. కళ్ళెం పట్టుకొని, గుర్రాన్ని పైకి ఎక్కించటం ప్రారంభించాడు. ఏటవాలుగా ఉండటం వలన కొండను ఎక్కటం సులువుగానే ఉంది.

కొండశిఖరానికి ఎక్కి వెనుదిరిగి చూశాడు. దూరంగా, అస్పష్టంగా కన్పించింది సుశీల ఉండే ఊరు సీతానగరం. అటునుంచి దృష్టిని ముందుకు సారించాడు రాజా. ఎదురుగా నిలువుగానున్న కొండలు కన్పించాయి. తానున్న కొండ కూడా వాలుగా కాకుండా, శిఖరంనుంచి కొద్దిగా నిట్ట నిలువుగా వాలిపోయి ఉంది.

నెమ్మదిగా గుర్రాన్ని నడిపించుకుంటూ కొండ దిగటం ప్రారంభించాడు రాజా.

కొండరాళ్ళు నున్నగా ఉండి, జారిపోతున్నాయి. అయినా జాగ్రత్తగా అడుగులు వేస్తూ కొండ దిగ సాగాడు. ఒకేసారి సూటిగా దిగటం ప్రమాదం. అందు వల్ల కొద్దిగా వాలుగా దిగటం ప్రారంభించాడు.

పూర్తిగా దిగేటప్పటికి మధ్యాహ్నం అయింది. చాలా అలసట అన్పించింది రాజాకి. ఆ లోయనిండా రకరకాల చెట్లు ఉన్నాయి. వాటిమధ్య సెలయేరు ప్రవహిస్తోంది.

ఆ రెండు కొండల నడుమ మధ్య సుమారు ఫర్లాంగు దూరం ఉంది. ఆ కొండలవైపు పోవాలంటే చెట్లను, సెలయేరును దాటుకుని పోవాలి.

గుర్రం ఎక్కి ఆ చెట్లమధ్యగా బయలుదేరాడు. చెట్ల మధ్యగా సెలయేరు కన్పించింది. సెలయేరు కటు ఇటు చెట్లున్నాయి. కొండ ఎగువనుండి సెలయేరు నున్నటి రాళ్ళమీద ప్రవహిస్తోంది.

సెలయేరు దగ్గిర దిగి స్నానం చేశాడు. సుశీల ఇచ్చిన చపాతీలు తిని, నీళ్ళు తాగాడు. దాపుల్లో ఉన్న చెట్ల క్రిందకు నడిచి, గుర్రాన్ని ఒక చెట్టుకి కట్టివేసి నడుం వాల్చాడు. తలపైనున్న టోపీని ముఖంమీదకు లాక్కొని ఎండపడకుండా చేసుకున్నాడు.

సరిగ్గా అదేసమయంలో ధన్ ధన్ మంటూ ఆ లోయ అంతా దద్దరిల్లి పోయింది. ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు రాజా. టోపీ సరిచేసుకొని, రివాల్వర్ తెరిచి చూశాడు. నిండా గుళ్ళున్నాయి. లోయ అంతా ఆ శబ్దం ప్రతి ధ్వనించటంవలన శబ్దం ఎటునుంచి వస్తోందో అర్థంకాలేదు. రివాల్వర్ కేసులో పెట్టి, సెలయేరు దగ్గరకు నడిచి, అటూ ఇటూ చూశాడు.

మరోమారు ధన్ మన్న శబ్దం, దానితోపాటు ఎవరిదో ఆర్తనాదం, గుర్రాల సకిలింపులతో లోయ మార్మ్రోగి పోయింది. అటూ ఇటూ చూశాడు. కాని ఎవరూ కన్పించ లేదు. సెలయేటిలోనుండి అవతలివైపు వెళ్ళాం అను కున్నాడు. తీరా దిగాక చూస్తే మోకాలు లోతుకంటే ఎక్కువ లోతులేదని. గుర్రంమీద ఎక్కి బయలుదేరాడు. రివాల్వర్ చేతిలో తయారుగా పట్టుకొని, జాగ్రత్తగా అటూ ఇటూ చూస్తూ నెమ్మదిగా గుర్రాన్ని నీళ్ళలోకి దింపాడు.

ఆ సెలయేరు దాదాపు నాలుగయిదు వందల గజాల వెడల్పు ఉంది. అవతలివైపు దట్టంగా చెట్లున్నాయి. సరిగ్గా మధ్యలోకి వచ్చేసరికి, దూరంగా సెలయేరు ఎగువ భాగంనుండి ఎవరో సెలయేటి నీళ్ళల్లో కొట్టుకొని రావటం కన్పించింది. రాజా గుర్రం దిగి, నీళ్ళల్లో నిలబడ్డాడు.

ఎవరో ఒక ముసలివ్యక్తి నీళ్ళల్లో కొట్టుకువస్తున్నాడు. అతన్ని పట్టుకొని వెనక్కు లాక్కెళ్ళాడు రాజా. పిస్తలు గుండు పొట్టలో తగిలింది కాబోలు, అక్కడంతా రక్తం పోయింది. శ్వాస నీర్సంగా ఆడుతోంది. చకచక ప్రథమ చికిత్స చేశాడు రాజా. రక్తం కారకుండా పొట్టకి కట్టు కట్టాడు. సెలయేటి నీరు దోసిలినిండా తెచ్చి అతని ముఖంమీద చల్లాడు. అతడు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

దాదాపు యాభైఏళ్ళ వయసుంటుంది అతనికి. ముఖం ముడతలు పడిపోయి ఉంది. కట్టుకున్న గుడ్డలన్నీ పీలిక లయిపోయి ఉన్నాయి. కొరడాలతో కొట్టినట్లు శరీరం నిండా వాతల గుర్తులున్నాయి. ముఖం అంతా వాచి పోయింది. చేతులు, మోకాళ్ళు, పొట్ట గీసుకుపోయాయి.

“ఎవరు మీరు? ఎవరు మిమ్మల్ని కాల్చారు? ఎందుకు కాల్చారు?” ఆదుర్దాగా అడిగాడు రాజా ఆ ముసలతను ముఖందగ్గర వంగి.

అతికష్టంమీద నోరు విప్పి చెప్పసాగాడా వృద్ధుడు:

“నా పేరు రాయుడు! మాది ఆ కొండల అవతల ఉన్న రాంపల్లె. మాది పెద్దజమీందారీ కుటుంబం. మా ఆస్తి అంతా బంగారు రూపంలో ఒకచోట భద్రంగా ఉంది. ఆ రహస్యం ఆ రామసేన ముఠాకి తెల్సిందెలాగో. మా పల్లెపై దాడిచేసి నన్ను పట్టుకున్నారు. ఆ బంగారం ఉన్న చోటు చెప్పమని హింసించారు. నేను పెదవి విప్పలేదు.

నేను వారి బారినుండి తప్పించుకొని ఇటుగా పరుగెత్తు కొచ్చాను. కాని వాళ్లు నన్ను చూశారు. చూచి వెంట బడ్డారు. నేను చావు తప్పదనుకొని సెలయేటి నీళ్ళలో అడుగు బెట్టాను. కాని వాళ్ళు కాల్చిన గుండు నా పొట్టలో దూరింది. నీళ్ళల్లో పడిపోయిన నన్ను చూసి వాళ్ళు తిరిగి వెళ్ళిపోయారు. నేను శక్తి లేక నీటివాలుకి యిటుగా వచ్చాను."

ఆ వృద్ధుడు చెప్పినది వినగానే రాజాలో కోపం రగుల కుంది. పిడికిళ్ళు బిగుసుకు పోయాయి. "తాతా! నీకింత చేసిన వాళ్ళకోసమే బయలుదేరాను. వారిని నాశనం చేసి తీరుతాను" ఉద్రేకంగా అన్నాడు రాజా.

ఆ వృద్ధుడు తృప్తిగా చూశాడు రాజా వైపు.

"బాబు! నా ప్రాణాలు బలికొంటున్న నిధి రహస్యం. చెబుతాను. చెవి తీసుకురా" అన్నాడు ఆయాసంగా. రాజా మరింత ముందుకు వంగాడు. ఆ ధనాన్ని దాచిన చోటు చెప్పాడు రాయుడు. ఏదో అడగబోయేంతలో తల వాల్చేశాడు అతను.

రాజా అతను చనిపోయాడని గ్రహించాడు. ప్రక్కనే గొయ్యితీసి పాతి పెట్టాడు. గుర్రం ఎక్కి, సెలయేరు దాటి బయలుదేరాడు.

ఆ చెట్లమధ్య కొంత దూరం పోయేటప్పటికి బురదగా ఉండిన చోటుల్లో గుర్రపు డెక్కల గుర్తులు కన్పిం చాయి. వాటిని అనుసరిస్తూ బయలుదేరాడు రాజా. చీకట్లు కమ్ముకుంటున్నాయి.

రాజా వెళ్ళటం ఆపి, గుర్రాన్ని ఒకచోట కట్టివేసి, దాపుల్లో ఉన్న చెట్లఫలాలు తిని, ఒక చెట్టు క్రింద నడుం వాల్చాడు.

5

రాజా వెళ్ళి గంట దాటింది. సీతారామ్ నెమ్మదిగా లేచి, మంచినీళ్ళు తాగి, చుట్టముట్టించుకున్నాడు. అప్పటి వరకు రాయును గురించే ఆలోచిస్తున్నాడతను.

"సుశీలా! సుశీలా!" జ్ఞాపకం వచ్చి పిలిచాడు. సుశీల పలకలేదు.

"లేదండి! ఎక్కడికో వెళ్ళింది!" లోపలనుంచి సమాధానం యిచ్చింది లక్ష్మమ్మ.

"ఎక్కడికి వెళ్ళింది? ఒంటరిగా బయట ఎప్పుడూ తిరగొద్దంటే వినదు" గొణుక్కున్నాడతను. అతని మెదడులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. గతం అంతా కళ్ళ ముందు మెదులుతూంది.

"పాపం! అబ్బాయి చాలా చిన్నవాడు. ఇంత వయస్సులోనే ఎన్ని కష్టాలు?" అంది లక్ష్మమ్మ లోపల్నుంచి. సీతారామ్ మాట్లాడలేదు. మరల లక్ష్మమ్మే అంది.

"ఎన్నాళ్ళిలా ఒంటరిగా ఈ అడవిలో ఉండటం? నాకు విసుగు పుడుతోంది." ఆమె కంఠంలో కోపం, విసుగు ధ్వనించాయి. అప్పటికీ సీతారామ్ మాట్లాడలేదు. గుప్పున పొగ వదులుతూ కూర్చున్నాడు.

లక్ష్మమ్మ ఏదో అనబోయింది. ఇంతలోనే బయట గుర్రపుడెక్కల చప్పుడు విన్పించింది. సీతారామ్ ఉలికిపడి లేచాడు. రాజా తిరిగి వస్తున్నాడేమో ననుకున్నాడాయన. కాని వచ్చేది ఒక్క గుర్రం కాదని, ఒకటికంటే ఎక్కువేనని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు ఆయనకు.

"అయ్యో! ఎవరో వస్తున్నారు. ఆ రామసేనే కాబోలు, సుశీల ఎటు వెళ్ళిందో?" కంగారుగా అంది లక్ష్మమ్మ. సీతా

రామ్ మాటాడకుండా లేచి గన్ అందుకున్నాడు. కిటికీ దగ్గరకు చేరి చూశాడు. బయట రోడ్ మీద ఆరుగురు వ్యక్తులు గుర్రాలమీద ఎక్కి ఆగి ఉన్నారు వరసగా. వారంతా రామసేన సభ్యులేనని వారి దుస్తులు తెలియ చేస్తున్నాయి.

వారంతా వరసగా ఆగి, బాటమీదుగా చూస్తున్నారు కొండవైపు. వాళ్ళల్లో వాళ్ళు ఏదో మాట్లాడుకుంటు న్నారు గాని, సీతారామ్‌కి వాళ్ల మాటలు విన్పించడం లేదు. సీతారామ్ గన్ని కిటికీలో వాళ్ళకి గురిగా పెట్టి కూర్చున్నాడు. లక్ష్మమ్మ సుశీల గురించి ఆదుర్దా పడుతూ, నెమ్మదిగా భర్తపక్కన చేరింది.

వాళ్ళంతా ఆగి ఎందుకలా అటు చూస్తున్నారో అర్థం కాలేదు సీతారామ్‌కి. వారికి తన ఇంటికి మధ్య సుమారు నూటయాభై గజాల కంటే ఎక్కువ దూరం ఉండదు. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. వారెందుకలా చూస్తున్నారో అర్థంకాని సీతారామ్ ఉలిక్కి పడ్డాడు.

ఒకవేళ సుశీల గాని రావటం లేదుగదా? ఉదయాన్నే వెళ్ళింది ఎక్కడికో! ఈ ఆలోచన రాగానే ఒళ్ళు ఝల్లు మంది సీతారామ్‌కి.

ఇంతకు బయట ఆ ఆరుగురు చూస్తున్నది సీతారామ్ అనుకున్నట్లు సుశీలనే.

రాజాని సాగనంపి హుషారుగా యింటికి పరుగెత్తుతూ, గుర్రాలమీద వచ్చే మనుషులను చూసి ఆగిపోయింది, తమ యిల్లు ఊరిచివరే కావటంవల్ల. భయంతో వణికి పోయింది వాళ్ళని గుర్తించగానే.

ఆ గుర్రాలమీద నున్న వ్యక్తులు కూడా సుశీలను చూశారు.

ఆరుగురిలో ఒకడన్నాడు. "ఒరేయ్ కోటీ! ఎవర్రా ఈ పిల్ల? ఒంటరిగా ఉంది."

"తెలియదు దొరా! బహుశా ఈ పల్లెదేనేమో?" కోటిగాడు జవాబిచ్చాడు.

"ఈ పల్లెని దోచుకున్నాంకదరా! ప్రజలంతా ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోయారని విన్నామే?"

"తెలియదు దొరా! బహుశా ఎవరన్నా తిరిగొచ్చారేమో?"

"ఆ పిల్లని పట్టుకోండి. మజాచేసుకోవచ్చు" వెకిలిగా నవ్వుతూ అన్నాడు దొర. వెంటనే యిద్దరు రౌతులు గుర్రాల్ని ముందుకు దూకించారు. సుశీల వెనక్కి తిరిగి పరుగెత్తసాగింది. కాని గుర్రంముందు ఆమె పరుగెంత? ఆమె కాళ్ళు చేతులు కట్టివేసి ఒక గుర్రంమీద వేసుకొని తీసుకువచ్చారు. ఆరుగురు వెకిలిగా నవ్వుతూ ఆమెనిచూసి పెదాలు తడిచేసుకోసాగారు.

గుర్రంమీద బంధించబడి ఉన్న సుశీలని చూడగానే అదిరిపడ్డారు సీతారామ్, లక్ష్మమ్మలు. కెవ్వున అరవబోయింది లక్ష్మమ్మ. సీతారామ్ చప్పున ఆమె నోరు మూశాడు.

ఒకడు సుశీలని గుర్రంమీద నుంచి క్రిందకి దింపాడు. తమ ఇంటికి దాదాపు ఎదురుగానే ఆగటంవలన వీరిచర్యలన్ని స్పష్టంగా కనిపిస్తున్నాయి సీతారామ్‌కి. సుశీల గింజుకొంటూంది. ఇద్దరు వ్యక్తులు ఆమెని మోసుకొని సీతారామ్ ఇంటికి అయిమూలగా ఉన్న ఇంట్లోకి తీసుకు వెళ్ళారు.

సీతారామ్‌లో క్రోధం పెచ్చు పెరిగిపోయింది. ముందు వెనుక లాలోచించలేదు. ఒకడిని గురిచూసి కాల్చాడు. కుప్పకూలాడతను.

తుపాకిశబ్దం కావటంతోనే మిగిలినవాళ్ళు తలలు వెనక్కి తిప్పి చూశారు. మరొకడు నేలకూలాడు. చటుక్కున సుశీలను తీసుకెళ్ళిన ఇంట్లోకి పరుగెత్తారు నలుగురు. అది కూడా సీతారామ్ ఉంటున్న ఇల్లులాంటిదే.

ఒక గుర్రాన్ని కాల్చి కాల్చాడు సీతారామ్. పెద్దగా సకిలిస్తూ గుర్రాలు పరుగెత్తాయి. ఇప్పుడు ఆ ఇంటికి, ఈ ఇంటికి మధ్య అడ్డంలేదు.

ఆ నలుగురు వ్యక్తులకు సీతారామ్ ఉంటున్న ఇంట్లోంచి కాల్పులు జరుగుతున్నాయన్న సంగతి తెల్సిపోయింది. నలుగురూ అతని ఇంటికి గురిచేసి కాల్పులు సాగించారు. వాళ్ళ తుపాకీ కాల్పులకు సీతారామ్ ఇంటి పెచ్చులూడి పోయి క్రిందపడసాగాయి.

సీతారామ్ కాల్పులు ఆపుచేశాడు. అటువైపునుంచి నాలుగయిదుసార్లు కాల్పులు సాగాయి. సీతారామ్ వేపు నుంచి కాల్పులు రాకపోవటంతో వాళ్ళూ ఆపారు. కొద్దిసేపు నిశ్శబ్దం అయిపోయింది.

ఒకడు నెమ్మదిగా పాకుతూ బయటికి వచ్చాడు. అంతే! అతడి ముఖం పచ్చడయిపోయింది. అరుస్తూ క్రిందపడి దొర్లాడు. సీతారామ్ ఇంటిమీద గుండ్లవర్షం కురిసింది.

"అబ్బ!" అన్న మూలుగుతో సీతారామ్ తల ప్రక్కకు తిప్పాడు. గుండు ఒకటి లక్ష్మమ్మకు తగిలి, ఆమె క్రింద పడిపోయింది. "లక్ష్మీ!" గావుకేక పెట్టాడు సీతారామ్ గన్ వదలి. అంతలోనే కాల్పులో ఒక గుండు అతని భుజాలలో దిగింది. కుప్పగా కూలిపోయాడు సీతారామ్.

ఎంతకీ కాల్పులు జరగకపోవటంతో అటువేపునుంచి ముగ్గురిలో ఒకడు బయటకువచ్చి సీతారామ్ ఇంటివైపు పరుగెత్తాడు. అతని క్షేమ ప్రమాదం సంభవించకపోవటంతో

మిగిలిన ఇద్దరు సీతారామ్ ఇంటిలోకి పరుగెత్తారు.

బోర్లగా లక్ష్మమ్మ శవంపై పడిపోయిఉన్నాడు సీతారామ్. రక్తం విపరీతంగా కారిపోయిఉంది.

పెద్దగా నవ్వారు వారు సీతారామ్‌ని చూసి. ఒకడు కాలితో వెల్లకిలా తిప్పాడు సీతారామ్‌ని.

"ఇంత ముసిలోడుకి ఎంత ధైర్యంరా? మనల్నే కాలుస్తాడా? అరేయ్. ఇంతకు ఆ పిల్లేది?" అనరిచాడొకడు.

ఒకడు పోయి సుశీల కాళ్ళ కట్లు విప్పి లాక్కొచ్చాడు. తల్లిదండ్రులను చూస్తూనే పెద్దగా అరిచి వారిమీద పడిపోయింది సుశీల. దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

"పాపం! ఈ పిల్ల తల్లిదండ్రులాగున్నార్రా!" అని ఒకడన్నాడు.

"నాన్నా! నాన్నా!" కుదిపింది చేతులతో సుశీల తండ్రిని. నెమ్మదిగా కళ్లు తెరిచి చూశాడు సీతారామ్.

"అమ్మా! నిన్ను ఈ రాక్షసుల బారినుండి తప్పించలేకపోతున్నామమ్మా. ఈ సమయంలో రాజా ఉంటే ఎంత బాగుండేది? తల్లి. నిన్ను ఒంటరిగా వదిలేసి పోతున్నాం. అబ్బ!" మూలిగాడు సీతారామ్.

రాజా అన్న పేరు విని వారు ముగ్గురు ఉలిక్కిపడ్డారు. తుపాకులు తయారుగా పట్టుకున్నారు.

"అమ్మా సుశీలా! నేను చేసిన ఘోరానికి శిక్ష అనుభవిస్తున్నానమ్మా. రాజా తల్లిని నాశనం చేసింది ఎవరోకాదు. నేనే! నేనప్పుడు మల్లు ముఠాలో సభ్యుణ్ని. కొంతకాలం తరవాత విడిపోయాము అంతా. అప్పుడే నువ్వు పుట్టావు రాజా ఇంతకాలం వెదుకుతున్నది నాకోసమే. నన్ను అతడు గుర్తించలేదు. కాని భగవంతుడు నాకు తగిన శిక్ష

చాడు. నా కూతుర్ని బలి తీసుకోబోతున్నాడు" ఆయాసంతో ఆగాడు సీతారామ్.

అప్రతిభురాలయిపోయింది సుశీల. సీతారామ్ ఏదో చెప్పబోయి కళ్ళు తేలేశాడు. పెద్దగా అరిచి అతని శవంపై బడిపోయిందామె.

"చచ్చినవాడితో పనేమిటి? మేమున్నాముగా!" వెకిలిగా అన్నాడొకడు. సుశీల గింజుకుంది. వారించింది. ప్రార్థించింది. వారు ముగ్గురు సుశీలను బయటికి లాక్కెళ్ళారు ఎదురింట్లోకి.

6

తూర్పున వెలుగు రేఖలు విచ్చుకుని ముఖంమీద పడటంతో మెలకువ వచ్చింది రాజాకి. చుట్టూ చూశాడు. ప్రక్కనే గుర్రం నిలబడిఉంది. గుర్రాన్ని విప్పి నీటిలోకి వదిలి ముఖం కడుక్కున్నాడు. ప్రక్కనే ఉన్న చెట్ల ఫలాలుతిని, కడుపునిండా నీళ్ళు తాగాడు. గుర్రం ఎక్కి నెమ్మదిగా బయలుదేరాడు.

ఆ రామసేన ముఠా ఇంకా ఆ లోయలోనే ఉందో లేదో తెలియదు. ఏమాత్రం చప్పుడు విన్పించినా అటువైపు చేతిలో రివాల్వర్ త్రిప్పుతున్నాడు. గుర్రాన్ని అదిలించాడు. అది వేగంగా పరుగెత్తసాగింది. వానకురిసి తడిఅవటంవల్ల డెక్కలు ఆసలు పెద్దగా శబ్దంచేయటంలేదు.

దాదాపు అరగంట ప్రయాణించి అవతలి కొండవద్దకు చేరుకున్నాడు. కొండ దిగువన ఆపాడు గుర్రాన్ని.

'ఈపాటికి రామసేన కొండ ఎక్కి దాటిపోయి ఉంటుంది. వారిని చేరుకోవాలంటే త్వరగా దాటాలి కొండను' అనుకున్నాడు. ఈకొండ, వెనుకటి కొండవలె కాకుండా ఏటవాలుగా ఉంది. సునాయాసంగా

గుర్రాన్ని నడిపించసాగాడు ఎక్కుడుండి. కొద్ది దూరం ఎక్కగానే పిస్టలు పేలిన చప్పుడు ధ్వనించింది. గుండు రాజా ప్రక్కగా దూసుకుపోయి అతని ఎదురుగానున్న చిన్న బండరాయికి కొట్టుకుంది. అదిరిపడి వెనక్కు తిరిగి చూశాడు రాజా.

ముగ్గురు వ్యక్తులు గుర్రాలమీద కూర్చొని, చేతిలో పిస్టల్స్‌ను అతనికి గురిపెట్టి ఉన్నారు. వారు రామసేన ముఠాలోనివారేనని గ్రహించాడు రాజా. అయితే అతనిలో అనుమానం వచ్చింది. వాళ్ళు ముగ్గురే ఉన్నారు. అయితే మిగిలిన వాళ్ళు ఏమయినట్లు?

"ఎవర్నువ్?" అరిచాడు మధ్యలో ఉన్న దొర. వారు అంతకుముందు రోజు సుశీలను మానభంగం కావించినవాళ్ళే.

రాజా మాట్లాడలేదు. వారిలో తను చిన్నప్పుడు చూసిన వ్యక్తి పోలికలు కన్పిస్తాయేమోనని పరిశీలించాడు. గడ్డాలు దట్టంగా పెరిగి ఉన్నాయి. జుట్టంతా చిందరవందరగా ఉంది. ఆ ముగ్గురూ క్రూరంగా చూస్తున్నారు రాజావంక. ఎంత ప్రయత్నించినా వారిలో తనకు కావాల్సిన వ్యక్తి లక్షణాలు కన్పించలేదు రాజాకి.

"ఏమిటి మాట్లాడవు? ఎవర్నువ్వు? ఎందుకిక్కడికి వచ్చావు?" మరొకడన్నాడు. "మాట్లాడేదేముంది. కాల్చి పారేయండి" దొర ఆజ్ఞాపించాడు.

రాజా నడుముకు ఉన్న రివాల్వర్ కేస్‌లోనుండి రివాల్వర్ తీయడం, వారిని గురిచూసి కాల్చటం క్షణాల్లో జరిగిపోయింది. ఏం జరిగిందో తెల్సుకునే లోపునే ఇద్దరి ప్రాణాలుపోయాయి. మూడోవాడి పిస్టలు గురితప్పి గుర్రం కాళ్ళదగ్గర పేలింది. పిస్టలు శబ్దాలతో ఆ లోయ అంతా మారుమోగిపోయింది.

రాజా గుర్రంమీదనుంచి క్రిందకురికాడు. మూడోవాడి జబ్బ పట్టుకొని క్రిందకు గుంజాడు. అతని పొట్టలో తగిలింది గుండు. ఏదో మాట్లాడబోయి తలవాల్చేశాడతను.

రాజా వాళ్ళ శవాలు తడిమాడు. నాటు రకం పిస్టల్సు తప్ప మరేమీ లేవు. నిరాశగా గుర్రం ఎక్కి కొండ ఎక్కించడం ప్రారంభించాడు. కొండశిఖరం చేరుకుని ముందుకు చూశాడు. దూరంగా నాలుగయిదు మైళ్ళ దూరంలో ఏదో పల్లె కన్పించింది. గుర్రాని నెమ్మదిగా క్రిందికి దింపి, పల్లెవైపు బయలుదేరాడు.

కొంతదూరం పోయేటప్పటికి ఎర్రమట్టి రోడ్ కన్పించింది. అది తిన్నగా పల్లెవైపు దారితీస్తూంది. ఆ రోడ్ కిరువైపులా బీడుపడ్డ పొలాలు, పొదలు తప్ప మరేమిలేవు. ఎర్రటి మట్టిలో దుమ్మురేపుకుంటూ రాజా గుర్రం పరుగులు తీయసాగింది.

పల్లె సమీపించింది. దూరంగా వస్తున్న గుర్రం, దాని మీద మనిషిని చూడగానే పల్లె ప్రజలు ఎక్కడి వారక్కడే భయంతో ఆగిపోయారు. బిలబిల పరుగెత్తి ఎవరి ఇళ్ళకు వారుచేరి తలుపులు వేసుకొని, కిటికీ సందుల గుండా రోడ్ మీదకు చూడసాగారు.

రాజా ఆ పల్లెలోకి ప్రవేశించాడు. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఆ పల్లెకూడా దాదాపు సీతానగరంలాగానే ఉంది. ప్రధానమయిన రోడ్ అదే. విశాలంగా, వెడల్పుగా ఉంది. రోడ్ కిరువైపులా కొండరాతితో కట్టబడిన ఇళ్ళు, పూరిగుడిసెలు ఉన్నాయి. రెండు మూడు వీధులున్నాయి. మొత్తంమీద ఆ పల్లెలో జనాభా రెండు వేలకు మించి ఉండదనుకున్నాడు ఇళ్ళని బట్టి. అతను ఇళ్ళ సందుల్లోంచి ప్రజలు భయంగా తనవంక

చూడటం గమనించాడు. తన్ను చూసి ఎందుకు భయపడుతున్నారో అర్థం కాలేదతనికి. తనవేషం కౌబోయ్‌లా ఉండటం చూసి ఎవరో అనుకుని భయపడుతున్నారని అనుకున్నాడతను. అంతలోనే గుర్తొచ్చింది. తనని రామసేన సభ్యుడని భావించటం లేదు కదా?

నెమ్మదిగా ఒక యింటిముందుకి గుర్రాన్ని నడిపించి, దిగాడు. తలుపులు వేసిఉన్నాయి. కిటికి సందులోంచి తనను చూడటం గమనించాడు రాజా. తలుపులు తట్టాడు. ఎవరూ తీయలేదు.

"భయపడకండి. నేను మిమ్మల్నేమి చేయను. నేను రామసేన సభ్యుణ్ని కాదు" అని అరిచాడు పెద్దగా. లోపల్నుంచి సమాధానం లేదు. మరొకసారి అరిచాడు.

"లేదు. నిన్ను నమ్మం. నువ్వు రామసేన సభ్యుడివి" లోపలినుంచి వినబడిందొక కంఠం.

"లేదు. కావాలంటే నన్ను చూడండి. నా దుస్తులు వాళ్ళ దుస్తులులా ఉన్నాయా?"

అతనలా అరవగానే ఒక యువకుడు కిటికీ దగ్గరకు వచ్చి రాజాని పరీక్షగా చూశాడు. రాజా రామసేన సభ్యుడిలా లేడు. వాళ్లు అంత శుభ్రంగా ఉండరు. వాళ్ళ దుస్తులే వేరు. పైగా మోటువాళ్ళు. రాజా చూస్తే కొంచెం సంస్కారవంతుడిలా ఉన్నాడు.

"సరే! నువ్వు ఆ ముఠాలో వాడివి కావని నమ్ముతున్నాను. ఏం కావాలి?" అన్నాడా యువకుడు.

"మీరంతా ఎందుకు భయపడుతున్నారో నాకు తెలుసు. నన్ను రామసేన సభ్యుడనుకుంటున్నారు. కాని కాదు. నేనూ వారిని వెదుక్కుంటూ వస్తున్నాను. మీ ఊరి జమిందారైన రాయుడిగార్ని రామసేన సభ్యులు

చంపేశారు'' అన్నాడు రాజా.

ఆ మాట వినగానే ఆ యువకుడు ఉలిక్కిపడ్డాడు. "రాయుడిగార్ని చంపేశారా?'' అనడిగాడు ఆత్రుతగా. రాజా తనకు తెల్సిన సంగతి చెప్పాడు నిధిరహస్యం తప్ప.

వీరిద్దరికి జరుగుతున్న సంభాషణను ఆలకిస్తున్న ఇతరులు రాయుడు చనిపోయారని వినటంతోనే కళవళ పడ్డారు.

"మీ గ్రామపెద్ద యిల్లు ఎక్కడ?'' అడిగాడు రాజా.

"ఇదే! నేను ఆయన కుమారుణ్ని'' యువకుడు జవాబిచ్చాడు.

"నాకు ఆయనవల్ల కొంత సమాచారం, సహాయం కావాలి.''

ఆ యువకుడు కొద్దిసేపు ఆలోచించాడు. లోనికి నడిచాడు.మరల కిటికీవద్ద ప్రత్యక్షమై రాజావంక పరిశీలనగా చూశాడు. అతను రామసేన సభ్యుడు కాదని నిశ్చయించుకున్నాడు. సాధారణంగా రామసేన సభ్యులు మనిషిని చూస్తే కాల్చిపారేస్తారు. కాని యితని ప్రవర్తన మరో విధంగా ఉంది. తలుపు తెరిచి లోనికి ఆహ్వానించాడు రాజాని. గుర్రం దిగి లోనికి అడుగుపెట్టాడు రాజా.

గ్రామపెద్ద రాజాని అలా లోనికి రమ్మనమనటంతో గ్రామప్రజలలో ధైర్యం వచ్చినట్లుంది. ఒక్కొక్కరే బయటకు చేరుకొని, గ్రామపెద్ద యింటిముందు గుమికూడారు.

లోపల రాజాకి ఎదురుగా ఒక వృద్ధుడు చిన్న కుర్చీపీటపై కూర్చొని ఉన్నాడు. ఆయన ప్రక్కన నలుగురు పిల్లలు నిలబడ్డారు. వారిప్రక్క ఒక వృద్ధురాలు, ఆమె ప్రక్క ఒక యువతి నిలబడి ఉంది. ఆమె ఆ యువకుడి భార్య అయివుంటుందని తలంచాడు రాజా. అందరు

భయంగా రాజావంక చూస్తూ నిలబడ్డారు.

"నా పేరు రాజా! మాది రామాపురం. నేను రామసేన ముఠావాణ్ని కాదు. నన్ను నమ్మండి" అన్నాడు రాజా.

"సరే నమ్ముతున్నాను. నీకేసహాయం కావాలి!" అడిగాడు వృద్ధుడు.

"ఆ రామసేన ఈ ఉదయం ఇటుగా పోయి ఉండాలి. నిజమేనా?"

"నిజమే" జవాబిచ్చాడు వృద్ధుడు.

"వాళ్ళ వివరాలు కావాలి. రామసేనలో ఎంతమంది ఉంటారు? వారి నివాసం ఎక్కడ మొదలైన వివరాలు కావాలి" అన్నాడు రాజా.

వృద్ధుడు చెప్పటం ఆరంభించాడు: "మాకు రామసేన పెద్ద బెడదగా ఉంది బాబు. ఎక్కణ్నుంచి, ఎప్పుడొస్తారో తెలియదు. గద్ద కోడిపిల్లని తన్నుకుపోయినట్లు హఠాత్తుగా వచ్చి పల్లెమీద పడతారు. దాచుకున్న ధాన్యం, ఆభరణాలు, విలువైన వస్తువులు దోచుకుపోతారు. వారి కంటబడ్డ ఏ పడుచుపిల్లను ఒదలరు. మగవాళ్ళను మాత్రం కాల్చి పారేస్తారు. అటువంటి వారు ఈ రోజు ఉదయం ఎటువంటి గొడవ చెయ్యకుండా పిస్టల్సు గాలిలోకి పేలుస్తూ పల్లెలోంచి దూసుకుపోయారు."

"ఎటువైపు" ఉత్సాహంగా అడిగాడు రాజా.

"అదుగో! ఆ కొండలలోనే వాళ్ళ నివాసం అని అనుకుంటారంతా. కానీ నాకూ సరిగ్గా తెలియదు. సుమారు యాభైమంది ఉన్నారు."

"నేను వారిని నాశనం చేస్తాను. ఎవరైనా నాకు తోడు వస్తారా?" అడిగాడు రాజా. వృద్ధుడు మాట్లాడలేదు.

ఒక్క క్షణం వృద్ధుడివైపు నడిచి, బయటకు నడిచాడు. అతని వెనకనే వృద్ధుడూ బయటకు నడిచాడు. వారిని చూడగానే అంతవరకు బయట నిలబడి గుసగుసలాడుతున్న జనమంతా మౌనం వహించారు.

వృద్ధుడు రాజా గురించి ప్రజలకు వివరించి చెప్పాడు. రాజాకి సహాయం వచ్చేవాళ్ళుంటే రమ్మనికూడా అడిగాడు. కాని ఎవరూ ముందుకు రాలేదు. రాజానే వారికి ధైర్యం చెప్పాడు. వారిలా అధైర్యపడితే లాభంలేదని, ఎదురు తిరిగి మట్టుపెట్టాలని హెచ్చరించాడు.

అతనలా అనేసరికి పాతికమంది యువకులు ముందుకు వచ్చారు తాము సహాయం వస్తామంటూ. రాజా వారి ధైర్యంచూసి సంతోషించాడు.

"మీ ధైర్యాన్ని అభినందిస్తున్నాను. కాని ఇది ప్రాణాలతో చెలగాటం. అన్నిటికీ తెగించినవాళ్ళే ముందుకు రండి. వారి ఆత్మీయుల, బంధువుల అనుమతి కూడా తీసుకోండి" హెచ్చరించాడు రాజా.

కొంతమంది వెనక్కు తగ్గారు. చివరకు పదిహేనుమంది యువకులు తయారయ్యారు.

"మీకు తుపాకీ కాల్చటం తెలుసునా?" ప్రశ్నించాడు రాజా.

ఎవరూ తమకి రాదన్నారు. "అంతా తుపాకీలను సిద్ధం చేసుకోండి. రేపట్నుంచి ఎలా కాల్చాలో నేర్పుతాను" అన్నాడు రాజా. అంతా తలలూపి వెళ్ళిపోయారు.

రాజా ఆరోజు గ్రామపెద్ద ఇంటిలోనే భోజనం చేశాడు. మర్నాటినుంచి తుపాకీ ఎలా కాల్చాలో, గుర్రపుస్వారి మొదలయిన విద్యలు వారికి బోధించాడు. వారం

రోజులలో అంతా సుశిక్షితులయ్యారు. ఒక మంచి రోజున అందరి ఆశీస్సులతో అంతా గుర్రాలమీద బయలుదేరారు రాజా నాయకత్వంలో.

ఆ పల్లెకు అటువైపు కూడా కొండలున్నాయి. ఆ కొండలలోనే రామసేన స్థావరం. అందరిని హెచ్చరించాడు రాజా ముందే.

"మనం ప్రాణాలతో తిరిగి వస్తామో రామో తెలియదు. ఆ దోపిడీ దొంగలను చంపి మనం చావాలి. ఇతరులకు వారి బాధ లేకుండా చేయాలి."

7

ప్రయాణం సాగిపోతూంది. చూడటానికి కన్పిస్తున్నా ఆ కొండలకు, పల్లెకు దూరం పాతికమైళ్ళ పైనే ఉంటుంది. దూరంగా నీలిరంగులో కొండలు కన్పిస్తున్నాయి.

"మధ్యలో ఊళ్ళేమయినా లేవా?" రాజా ప్రశ్నించాడు తన ప్రక్కనే ఉన్న ఒక వ్యక్తిని.

"పల్లెలయితే ఉన్నాయి కాని, అంతా ఖాళీచేసి వెళ్ళిపోయారు. ఆ రామసేన ఆగడాలు భరించలేకపోయారు. అంతకంటే ఏమిచేయగలరు!"

"ఖాళీచేసి ఎక్కడికి పోగల్గుతారు? ఎంతకాలమని ఉంటారు?"

"ఈ చుట్టుప్రక్కలగల నాలుగయిదు ఊళ్ళన్నీ ఖాళీ అయ్యాయి. ఇక మాపల్లె ఒక్కటే మిగిలిపోయింది. ఇవాళో, రేపో ఖాళీచేసి ఎక్కడో వందమైళ్ళ దూరంలో ఉన్న పట్నం వెళ్ళిపోదామనుకుంటున్నాం. కాని ఇంతలో మీరు వచ్చేశారు."

రాజా గుర్రం ఆపాడు టక్కున. అతన్ని అనుసరించి

వస్తున్న వారు కూడా ఆపారు. ముందుకు దృష్టి సారించారు. దూరంగా ఏదో నల్లటి పొగ ఆకాశంలో కన్పిస్తోంది.

"ఆ పొగ వచ్చే ఊరిపేరు చంద్రాయిపాలెం. బహుశా తగలబడుతున్న దేమో?" ఆదుర్దాగా అన్నాడు ఒక యువకుడు.

"ఆపల్లె కూడా ఖాళీ అయిందా?"

"అవును. మొత్తం పట్నం వెళ్ళిపోయారు."

రాజా ఆలోచించాడు. పల్లె ఖాళీచేసి వెళ్ళినా ఇంకా పొగ రావటం ఏమిటి? రామసేన ఇంకా అక్కడే ఉందా, లేక పోతూపోతూ ఏదైనా ఇంటిని తగలబెట్టి పోయారా? పొగను చూస్తే దట్టంగా, ఇప్పుడే తగలబడుతున్నట్లు ఉంది. పల్లెలో ఎవరయినా ఉన్నా అంత పొగ వచ్చేట్లు మంట వేయరు.

"మనం రామసేనను సమీపించాం. జాగ్రత్తగా ఉండండి. పల్లెలోకి వెళ్ళగానే కాల్పులు సాగిస్తారు. తుపాకులతో సిద్ధంగా ఉండండి" అరిచాడు రాజా వెనక్కు తిరిగి.

గుర్రాలు పల్లెవైపు దౌడు తీయసాగాయి. వారంతా ఎర్రటి దుస్తులలో ఉన్నారు. అందువల్ల ముఖాముఖీగా ఎదురొన్నా తమవారెవరో, దొంగలెవరో తెల్సిపోతుందని రాజానే అలా చేయించాడు.

అందరికన్న ముందుగా రాజా గుర్రం దౌడుతీయసాగింది. ఎర్రమట్టి రోడ్డు కావటంవల్ల దుమ్ములేస్తోంది. అందరిదీ ఒకే గమ్యం, ఒకే దృష్టి. అందరూ పల్లెని సమీపించారు.

అది మిగిలిన పల్లెలకన్న భిన్నంగా ఉంది. ఆ ఊళ్ళో ఇళ్ళన్నీ దాదాపుగా కొండరాళ్లు పేర్చి వాటితో కట్టబడ్డాయి. మొదట ఒకటిగా ఉన్న ప్రధాన మార్గం

కొద్ది దూరంపోయి రెండుగా చీలిపోయింది. ఆ రెండు చీలికలు ప్రక్క ప్రక్కనే ఉండి ఇంగ్లీషు 'వై' ఆకారంలో ఉన్నాయి. రాజా తన బృందంతో ప్రవేశించాడు ఊళ్లో. రోడ్డు చీలిక దగ్గర ఆగిపోయారు.

"ఆ ఎడమవైపు మార్గం కొండలలోకి పోతుంది. కుడివైపు మార్గంగుండా వెళితే నాగాయిపాలెం వస్తుంది" వివరించాడొక యువకుడు.

రాజా పరిశీలనగా రెండు దోవలగుండా దృష్టి సారించాడు. రెండూ తిన్నగా ఏ మెలికలు లేకుండా ఉండి ఊరు చివరలు కూడా స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎడమవైపు ఊరిచివర పెద్ద దేవాలయం గోపురం ఎత్తుగా ఉండి కన్పిస్తోంది. దాని ప్రక్కనే మూడంతస్థులు గల మేడ, జమీందారుగారి కాపోలు కన్పిస్తోంది. అదొక్కటే ఆ ఊళ్ళో ఎత్తైన భవనం.

రాజా ఎడమవైపు మార్గంలోకి గుర్రాన్ని మళ్ళించాడు. రాజా కళ్ళు ప్రతి ఇంటిని, ప్రతి వీధిని అంగుళం వదలకుండా గాలిస్తున్నాయి. కొద్దిదూరం వెళ్ళారు.

"ఆ కన్పించే ఎత్తైన భవనం ఈ ఊరి జమీందారు, గ్రామపెద్ద ఐన రాజారావు బహద్దరు గారిది" అన్నాడు ఒక యువకుడు.

"ఇప్పుడాయింట్లో ఎవరైనా ఉంటున్నారా?" ప్రశ్నించాడు రాజా.

"ఎవరూ లేరు. అంతా ఖాళీ అయిపోయింది" అన్నాడతను. దేవాలయంకు అటువైపు ఉన్న మూడో ఇల్లు తగలబడుతోంది. అక్కణ్ణించే పొగ వస్తోంది. దేవాలయానికి ఇటువైపు జమీందారుగారి భవనం. ఆ భవనం రాజా కుడిచేతివైపు ఉంది.

అందరూ భవనాన్ని సమీపించారు. భవనానికి, వారికి మధ్యదూరం సుమారు వెయ్యి గజాలు ఉంటుంది. అదే సమయంలో భవనం పై అంతస్థులో ఏదో ఆకారం కద లటం గమనించాడు రాజా. అతని చేతులు రివాల్వర్‌ను ఎత్తాయి.

అదే క్షణంలో ఆ భవనం పైఅంతస్థు నుండి తుపాకులు పేలాయి "ధన్" మంటూ. ఆ శబ్దాలకి రాజా బృందం లోని గుర్రాలన్నీ బెదిరి పెద్దగా సకిలిస్తూ ముంగాళ్ళమీద లేచాయి. కొంతమంది అదురుపాటుకు క్రింద పడ్డారు. మరోమారు తుపాకులు పేలాయి. గుళ్ళదెబ్బలు తగలటం వలన రోడ్ మీద ఎర్రమట్టి దుమ్ము లేచింది. గుర్రాలు అటూ, ఇటూ పరుగెత్త సాగాయి.

రాజా అనుచరులలో ధైర్యం సన్నగిల్లింది. బతికుంటే బలుసాకు తినవచ్చని ఎవరికివారే గుర్రాలు ఎక్కి వెనుదిరిగి పారిపోసాగారు. వారిమీద గుళ్ళ వర్షం కురియసాగింది.

ఈ హడావిడిలో రాజా గుర్రాన్ని ముందుకు దూకిం చాడు. అతనిమీద గుళ్ళవర్షం కురుస్తున్నాకూడా లెక్క చేయకుండా, రివాల్వర్ ఎత్తి భవనం వైపు గురి పెట్టి కాల్చాడు. ఎవరో పెద్దగా అరుస్తూ పడిపోయారు. మరు క్షణమే గుళ్ళవర్షం రెట్టింపు అయింది. రాజా కాలిలో గుండు దిగబడింది. గుర్రం మీదనుంచి క్రింద పడ్డాడు. గుర్రం పారిపోయింది.

లేచి నిలబడబోయేంతలో మరొక గుండు ఎడమభుజంలో దూరింది. దొర్లుకుంటూ పడివైపు ఉన్న ఇంట్లోకి ప్రవేశిం చాడు. భుజంనుంచి, కాలినుంచి విపరీతంగా రక్తం కార సాగింది. జేబులో ఉన్న గుడ్డను చించి కాళ్ళకు, భుజానికి అతికష్టంమీద కట్టుకున్నాడు రక్తం రాకుండా. శరీరం

అంతా నిస్సత్తువుగా అయిపోయింది.

ఒకసారి తాను ఉన్న ఇల్లు చూశాడు. పూర్తిగా రాళ్ళతో చేయబడిందది. లోపలంతా మసిబారిపోయి ఉంది. ఆయిదారు గజాల అవతల పశువుల కొట్టం ఉంది. ఆ ఇల్లు పైభాగం చదునుగా, చట్టాలా ఉంది. పశువుల కొట్టంలో నీళ్ళతొట్టి కన్పించింది. ఆశగా దాని దగ్గరకు పాక్కుంటూ వెళ్ళాడు. అడుగున ఎప్పటివో నీళ్ళు కన్పించాయి. ఆత్రంగా దోసిలితో తాగాడు. కాస్త సేద తీరింది.

పైన చట్టామీద అలికిడి అయింది. మెరుపులా రివాల్వర్ తీసి పేల్చాడు అలికిడి అయిన వైపు. ఎవరో అరుస్తూ నేలకూలారు.

గుమ్మంవరకు పోయి, అతని చేతిలోని తుపాకీ లాక్కున్నాడు. తల బయటపెట్టి చూశాడు. భవనంనుంచి పది, పన్నెండుమంది బందిపోటు దొంగలు తుపాకులతో తయారయి ఆ ఇంటివేపు వస్తున్నారు. గురిచూసి పేల్చాడు. వరసగా కూలిపోయారందరూ.

కొద్దినిముషాల అనంతరం రోడ్ మీదకు మరో పదిహేను మంది ప్రత్యక్షమయ్యారు. మరలా వారిని కాల్చసాగాడు రాజా. ఆదేసమయంలో పైన ఇళ్ళమీదుగా వచ్చిన దొంగలు అతనిమీదపడి, తుపాకీ లాక్కున్నారు.

8

దాదాపు నలభైమంది వ్యక్తులు.

కండలు తిరిగి, మోటుగా ఉన్నారు. దళసరిగా ఉన్న కోట్లు, నీరుకావి రంగు ధోవతులు. భుజాలకు తుపాకులు వేలాడుతున్నాయి. భుజానికి, నడుంకి అయిమూలగా తూటాలున్న బెల్టు ఉంది.

ఆ దొంగల గుంపు నాయకుడి పేరు దొర. అతన్ని అందరూ దొర అనే పిలుస్తారు. అతనికి మాత్రం నెత్తి మీద తలపాగా చుట్టబడి ఉంది.

ఆ నల్లభీమంది, నల్లభై గుర్రాలు ఎక్కిపోతున్నారు. అదే రామసేన.

దొర అందరికంటే ముందుండి దారితీస్తున్నాడు తమ స్థావరానికి. అతని వెనుక మూడు వరుసలలో మిగిలిన అనుచరులు అనుసరిస్తున్నారు. చివర వరుసలోనున్న ఒక గుర్రంమీద రాజా కట్టివేయబడి ఉన్నాడు. అతను స్పృహలోలేడు. గుర్రాల డెక్కలకు దుమ్ము లేస్తోంది.

అంతా ప్రయాణించి ఆ కొండల దగ్గరకి చేరారు. ఆ కొండలలో కొంతదూరం ప్రయాణించారు. అక్కడంతా కొండలన్నీ ఒత్తుగా ఉన్నాయి. కొంత దూరంపోయి ఒక బండరాతి వెనుకకు వెళ్ళారు. దాని వెనుక ఒక దోవ ఉంది. అది రెండు నిలువుగానున్న కొండలు ఒరుసుకునే ప్రదేశం. వాటి రెంటినడుమ చిన్న సందు, దోవగా ఉపయోగపడుతోంది. ఆ దోవముందే పెద్ద బండరాయి ఉండటంవలన దాని వెనుకనున్న దోవ, పరీక్షగా చూస్తేకాని తెలియదు.

ఆ దోవగుండా లోనికి ప్రవేశించారు. లోపల అంతా మైదానం, చక్కటి గడ్డి పెరిగిఉంది. ఆ గడ్డిమధ్య దోవ ఉంది. ఆ మైదానం చుట్టూ నిలువుగా ఉన్న కొండలు. ఆ దోవ తప్ప మరో దోవలేదు లోపలికి. బయటనుండి చూసేవాళ్ళు ఆ కొండల నడుమ అంత విశాలమయిన మైదానం ఉందని గ్రహించలేరు. కనీసం ఊహించనయినా ఊహించలేరు. ఆ మైదానంలోనే ఒక మూల పెద్ద సెలయేరు పారుతోంది కొండలమీదనుంచి.

ఆ దొంగలు అంతా గడ్డి మధ్యగానున్న దోవగుండా ప్రయాణించి మైదానం ఆవలివైపు చేరారు. అక్కడ గుహలులా ఉన్నాయి. ప్రక్కనే రాతితో నిర్మించబడిన ఇళ్ళున్నాయి.

దొర ఆజ్ఞ మీద రాజాని ఒక విశాలమైన గుహలో బంధించారు. అక్కడ ఉన్న ఎండు గడ్డిమీద, కాళ్ళు చేతులు కట్టి కూలేశారు.

రాజాకి ఇంకా స్పృహరాలేదు. అతను తప్పించుకో లేడని వారి ఆలోచన. అతని దగ్గరున్న రివాల్వరు, తూటాలు లాక్కున్నారు. అతన్ని వదలి తమతమ ప్రదేశాలకు వెళ్ళిపోయారు. అప్పటికే చీకటిపడింది. గుహలో కాగడాలు వెలిగించి ఉన్నాయి చీకటిగా ఉండటంవలన.

9

స్పృహ వచ్చింది రాజాకి. నెమ్మదిగా కళ్లు తెరిచి చూశాడు.

ఒక్క క్షణం తను ఎక్కడున్నది జ్ఞప్తికి రాలేదు. క్రమంగా అంతా గుర్తుకొచ్చింది. 'అయితే వాళ్ళు తనని బంధించారన్నమాట' అనుకున్నాడు రాజా.

అతనికి ఒక సందేహం కలిగింది. మనిషిని చూస్తే చాలు కాల్చిపారేసే ఈ బందిపోట్లు తనని కాల్చకుండా ఎందుకు వదలిపెట్టినట్లు? బహుశా తనవేషం వింతగా తోచి ఉండవచ్చు ననుకున్నాడు రాజా.

తలవిదిలించి ఆ గుహను పరిశీలనగా చూశాడు. కాగడాల వెలుగులో అంతా స్పష్టంగా ఉంది. ఆ గుహలో కత్తులు, బల్లాలు మొదలైనవి ఒక మూల కట్టగా పెట్టబడి ఉన్నాయి. రెండో మూల ఒకదానిపై ఒకటి పేర్చి ఇరవై పెట్టెలు పేర్చబడి ఉన్నాయి. వాటిని చూసి

ఉలిక్కి పడ్డాడు రాజా. అవి ఎక్స్ప్లోజివ్స్. బహుశా ఏ తెల్లదొరల దగ్గరో దొంగతనంగా తెచ్చి ఉంటారను కున్నాడు. అలిక్కిడి సహా ముఖద్వారం వైపు తలతిప్పాడు.

ఎవరో ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు. అతను రామ సేన మురావాడని చూడగానే గ్రహించాడు రాజా. అతని తలపై తలపాగా ఉంది. అతనే నాయకుడు దొర.

"ఎవర్నువ్?" అడిగాడు అతను. అతని కంఠం క్రూరంగా, బొంగురుపోయి ఉంది.

"నా పేరు నీకనవసరం!" నిర్లక్ష్యంగా అన్నాడు రాజా. మరుక్షణం దొర తన్నిన తన్నుకి అతని కళ్ళ ముందు నక్షత్రాలు కనిపించాయి.

"ఎంత పొగరు? ఈ రామసేన నాయకుడికే ఎదురు చెబుతావా? నిన్ను చిత్రవధ చేస్తాను" అరిచాడు దొర. రాజా మాట్లాడలేదు.

"ఉదయం నీపని చూస్తాను. చిత్రవధ చేసి నీ ప్రాణాలు తీస్తాను" అని వెళ్ళిపోయాడతను. అతను వెళ్ళిన తరువాత ఇద్దరు వ్యక్తులు వచ్చి రాజాని అక్కడే ఉన్న మోకులకు బంధించారు.

10

తెల్లవారింది.

సూర్యుడు అప్పటికే చాలా పైకి వచ్చాడు.

రాజాను కట్లు విప్పి మైదానంలోకి తెచ్చారు. ఇప్పు డతను స్వేచ్ఛగా ఉన్నాడు. కాని రివాల్వర్ లేదు. రాత్రి ఆహారం లేకపోవటం వలన నీరసంగా ఉంది. తనను ప్రాణాలతో ఉంచరని తెలుసు. వీలయితే తప్పించుకు పారిపోవాలి. లేదా వీలయినంత మందిని చంపి చావాలి.

మైదానంలో గుహకు కొద్ది దూరంలో నిలబెట్టారు

రాజాని. ఆలోచిస్తూ నిలబడ్డాడు రాజా ఎలా తప్పించుకోవటమా అని. ఇక్కణ్నుంచి పరుగెత్తుకు పోదామన్నా బయటకు దోవ సరిగ్గా తెలియదు. తను స్పృహలో లేని సమయంలో తెచ్చారు తనను.

ఇంతలో దొర ప్రక్కనే ఉన్న ఇంట్లోనుండి బయటికి వచ్చాడు. అతని భార్య కాబోలు బయటికి వచ్చింది అతని వెమ్మటే. అలాగే మిగిలిన జనం అంతా రాజా చుట్టూ నిలబడ్డారు వినోదం చూస్తూ. దొర క్రూరంగా నవ్వాడు రాజావంక చూసి. తన పని ఆఖరని తలంచాడు రాజా.

దొర రివాల్వర్ గురిపెట్టాడు. అది రాజాదే. దానినిండా గుళ్ళున్నాయి. రాజాకి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కబోయాడు. అదే సమయంలో ధన్ ధన్ మంది. రాజా ఉలిక్కిపడి చూశాడు. దొర నేలమీదపడి గిలగిల కొట్టుకుంటున్నాడు. రాజా అటూ ఇటూ చూశాడు. అతనికి ప్రక్కనే ఉన్న చిన్న కొండపైనుండి ఎవరో నిలబడి చేయి ఊపారు.

రాజా ఒక్క గంతువేసి, నాయకుడి దగ్గర రివాల్వర్ లాక్కున్నాడు. ఈలోపు కొంతమంది అతనిమీదకు దూకబోయారు. టపటప కాల్చిపారేశాడు. మిగిలినవాళ్ళు గుహలోకి పరుగెత్తారు ఆయుధాలకోసం. అదే సమయంలో రాజాకి మెరుపులా ఒక ఆలోచన తోచింది. చటుక్కున ముందుకు పరుగెత్తి, ఒకడిదగ్గర ఉన్న తుపాకీ లాక్కుని గుహవైపు గురిపెట్టి నొక్కాడు.

అంతే! అతని అంచనా తప్పుకాలేదు. గుహకు ఎదురుగా ఉన్న ఎక్స్ప్లోజివ్స్ పేలసాగాయి. రాజా చెంగున ఒక గుర్రం ఎక్కి అదిలించాడు. విపరీతమయిన వేగంతో మైదానంలోకి దౌడుతీసిందది.

వెనక గుహ దద్దరిల్లిపోతోంది. లోపలినుంచి హాహా

కారాలు, మంటలు వెలువడుతున్నాయి. మైదానం అవతలి వైపుకు దోవద్వారా చేరాడు. అతనికి సందు కన్పించింది. దానిద్వారా బయటపడ్డాడు. అప్పటికే ఒక గుర్రపు రౌతు రెడీగా నిలబడి ఉన్నాడక్కడ. రాజా అనుచరుడే అతను.

అయిదు నిమిషాలపాటు శబ్దాలు విన్పించాయి. ఇద్దరు ద్వారం ప్రక్కనే ఒక అరగంట గడిపి లోనికి వెళ్ళి చూశారు. ప్రేలుళ్ళవలన ఆ గుహ పైభాగం విరిగి పడిపోయి, గుహ మూసుకుపోయి ఉంది. జీవాలతో బ్రతికి ఉన్నాయి దూరంగా ఉన్న కొన్ని గుర్రాలు మాత్రమే.

రాజా ఆ దృశ్యంవైపు చూశాడు కన్నార్పకుండా. అతనికెందుకో తన తల్లిని మానభంగం కావించిన వ్యక్తి అక్కడే వాళ్ళల్లో ఉండి చనిపోయాడనిపించింది.

ఇద్దరు వెనుదిరిగి బయలుదేరారు.

"నా ప్రాణం కాపాడినందుకు నీకెంతో ఋణపడి ఉన్నాను" కృతజ్ఞతగా అతనివంక చూస్తూ అన్నాడు రాజా. "అందరూ పారిపోయారుగదా! నువ్వొక్కడికి ఎలా రాగల్గావు?"

"వాళ్ళు తుపాకీలు పేల్చగానే మేమంతా వెనుదిరిగి పారిపోయాము. కొంతదూరం పోయాక నేను ఆలోచించాను. మిమ్మల్ని ఒంటరిగా వదిలి మేము భీరువులవలె పారిపోయిరావటం పిరికితనం అన్పించింది. పైగా పల్లెలో ధైర్యసాహసాలుగల వాళ్ళమని ప్రగల్భాలు పలికి బయలుదేరాము. మేము వెళ్తే మాకెంత అవమానమో నేను ఆలోచించాను. ఏమయినాసరే మీతోపాటే అనుకున్నాను. నాతో ఎవరూ రావటానికి అంగీకరించలేదు. నేనొక్కణ్ణే తిరిగివచ్చాను. అప్పుడే స్పృహతప్పి పడివున్న మిమ్మల్ని

గుర్రంమీద వేసి వెళ్ళబోతున్నారు. మిమ్మల్ని చంపివేశా రేమోనని కంగారుపడ్డాను. ఎందుకయినా మంచిదని వారిని అనుసరిస్తూ వచ్చాను. మిమ్మల్ని కాపాడగల్గాను.''

"నా ప్రాణం కాపాడిన నీకు కృతజ్ఞతగా ఏమి వ్వాలో తెలియటం లేదు" అన్నాడు రాజా. హఠాత్తుగా అతనికి తనకు రాయుడు చెప్పిన నిధి రహస్యం గుర్తు కొచ్చింది.

"రాయుడుగారి వంశస్థులు ఎవరైనా ఉన్నారా?" అడిగాడు రాజా.

ఆ మాట వినటంతోనే ఆ యువకుడి వదనం మ్లాన మయింది.

"రాయుడుగారు మా తాతగారే!" అన్నాడు బరువుగా. రాజా ఆశ్చర్యపోయాడు. రాయుడుగారు తనకు చెప్పిన నిధిరహస్యం అతనికి చెప్పాడు.

ఇంతలో పల్లె సమీపించింది.

గ్రామస్థులంతా ఉత్సాహంతో గుమిగూడారు. ఇద్దరు అక్కడికి చేరారు. దోపిడీదొంగలముఠా రామసేన నాశన మైందని విని ప్రజలంతా సంతోషించారు. గ్రామపెద్ద రాజాను ఆ రోజు అక్కడే ఉండి పొమ్మన్నాడు. కాని రాజా అంగీకరించలేదు. తగిలిన గాయాలకు వైద్యుడి చేత వైద్యం చేయించి వెంటనే బయలుదేరాడు ఒంటరిగా. గ్రామ ప్రజలంతా వీడ్కోలు ఇచ్చారతనికి.

రాజా ఎక్కడా ఆగలేదు. తిన్నగా కొండలు దాటి వచ్చేశాడు. దూరంగా సీతానగరం కనిపిస్తూంది. పట్టలేని సంతోషంతో ఉన్నాడు రాజా. అతని హృదయం ఆనందంతో గంతులు వేస్తోంది. దానికి తగ్గట్టు గుర్రం కూడా

తన యజమాని ఆత్రతకు తగ్గట్టు మిక్కిలి వేగంగా పరు గెడుతూంది.

పూరిపాక బయట నిలబడి దూరంగా దుమ్ము రేపు కుంటూ వస్తున్న గుర్రాన్ని చూడగానే, చప్పున లోనికి జారుకుంది సుశీల. కొద్దిసేపటి తరువాత రాజా గుర్రం ఆపి, దిగాడు.

"సుశీలా!" అని అరిచాడు ఆనందంతో, ఇంటిముందు నిలబడి. సుశీల ఉలిక్కిపడింది. అది రాజా గొంతు. ఆమె హృదయం ఆనందంతో గంతులు వేసింది. కాని ఇదంతా ఒక్క క్షణమే. తన స్థితి జ్ఞాపకం వచ్చి ఒణికిపోయింది. తను మైలపడింది. రాజాకు తగదు.

ఇంతలో ఆత్రంగా తలుపు తెరుచుకొని లోనికి ప్రవే శించాడు రాజా. సుశీలని చూసి అదిరిపోయాడు.

ఆమెలో మునుపటి కళాకాంతులు లేవు. నలభై ఏళ్ళ ముసలిదానిలా అవుపిస్తోంది. వెక్కి వెక్కి ఏడుస్తోంది. చాలా నీర్సంగా ఉంది.

"సుశీలా!" ఆమె దగ్గరకు చేరి, అక్కున చేర్చుకో బోయాడు రాజా. సుశీల వద్దని వారించింది. నిర్ఘాంతపో డయాడు రాజా.

"రాజా! నువ్వు తిరిగొచ్చావు. అదే చాలు!" అంది ఏడుపు ఆపుకొని.

"సుశీలా! ఏమైంది? సీతారాం, లక్ష్మమ్మగారేరి? నిజం చెప్పు. ఏం జరిగింది?" ఉద్రేకంగా అడిగాడు రాజా.

సుశీల ఏడుపు ఆపుకోలేక పోయింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమెని వారించలేదు రాజా. కొద్ది సేపటికి తేరుకొని, పూర్తిగా చెప్పింది. రాజా అదిరిపోయాడు.

"అవును రాజా! జరిగిన విషయం ఇది. నన్ను ఆ ముష్కరులు బలాత్కరించారు. బలవంతంగా చెరిచారు. నా తల్లిదండ్రులను పొట్టన బెట్టుకున్నారు. నీ కోసమే ఇంత కాలం బ్రతికున్నాను. ఇక నేనేమయిపోయినా ఫరవా లేదు."

"లేదు సుశీల! నిన్ను ప్రేమించాను. నన్ను పెళ్ళాడ తానని మాటిచ్చావు. నీ కోరిక తీర్చాను. ఆ రామసేనను నాశనం చేశాను. నా కోరిక తీర్చు. నిన్ను పెళ్ళి చేసు కుంటాను" ఉద్రేకంగా అన్నాడు రాజా.

"లేదు రాజా! నాకిష్టం లేదు. ఈ మలిన దేహంతో నీ భార్యగా జీవించలేను. అంతేకాదు. నాకు ఏదో రోగం కూడా అంటుకుంది" అన్నది సుశీల.

"ఫరవాలేదు సుశీల. వైద్యం చేయిస్తాను పట్నం తీసు కెళ్ళి."

నవ్వింది బలహీనంగా సుశీల. "లాభం లేదు రాజా!" అంది.

ఇద్దరు అలానే కొద్దిసేపు కూర్చుండిపోయారు.

చివరకు సుశీలే అంది రాజాతో.

"రాజా! నామాట విని వెళ్ళిపో!"

ఉలిక్కిపడ్డాడు రాజా. "లేదు సుశీల! నిన్నొదిలి ఎక్కడికీ వెళ్ళను" అన్నాడు దృఢంగా రాజా.

"రాజా!" అరిచింది సుశీల.

ఆశ్చర్యంగా ఆమెవంక చూశాడు రాజా.

"ఇంతేనా! అప్పుడేదో ప్రగల్భాలు పలికావే? నీ తల్లిని చంపిన వ్యక్తిని మట్టుపెట్టి ఆమెకి ఆత్మశాంతి కలి గిస్తానని శపథం చేశావుగా? ఏమైంది? ఆ శపథం మర్చి పోయావా? నీకు కావలసిన వ్యక్తిని గుర్తు పట్టావా?"

పిచ్చిగా, ఉద్రేకంగా అరిచింది సుశీల. ఆమెకి తన తండ్రే హంతకుడని, ఆ రాక్షసుడని చెప్పాలనిపించలేదు. తనను రాజా వదిలెయ్యాలన్నదే ఆమె ధ్యేయం అయి పోయింది.

తన పగ గుర్తుకు రాగానే క్రోధంతో ఎగిరి పడ్డాడు రాజా.

"సుశీలా! ఆ రామసేనలో నా తల్లిని చంపిన రాక్షసుడు వుండివుంటాడు. అందరిని మట్టుపెట్టాను. నా పగ తీరి వుంటుంది" అన్నాడు.

"లేదు. నీ పగ తీర్చుకోలేక అలా అంటున్నావ్?" అంది సుశీల.

"సుశీలా!" రాజా కేకతో దద్దరిల్లింది పూరిగుడిసె.

సుశీల భయంతో రాజానే చూస్తుండిపోయింది.

"నేనంటే నీకిష్టంలేదని చెప్పు! అంతంత మాటలు దేనికి?" వ్యంగ్యంగా అన్నాడు రాజా. అదిరిపడింది సుశీల.

"లేదు రాజా! నిన్నెంతో ప్రేమిస్తున్నాను. కాని నేను మలినమై పోయాను" ఏడుస్తూ అంది. ఆమె ఏడుపు చూడగానే కోపం కరిగిపోయింది రాజాలో. అనునయించాడామెను.

ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

ఆ రాత్రి భోజనాలు ముగించి, పడుకున్నారు. తన వీరోచిత గాథలు చెప్పాడామెకు. అలసటగా వుండటం వలన గాఢమైన నిద్ర పట్టింది రాజాకు.

అర్థరాత్రి తుపాకీ చప్పుడు విన్పించి ఉలిక్కిపడి లేచాడు రాజా. దీపం వత్తి వెలిగించాడు. సుశీల పడి పోయి వుంది. ఆమె కడుపునిండా రక్తం.

"సుశీలా!" గావుకేక వేశాడు రాజా. "ఎంత పని చేశావు?" బాధగా అన్నాడు.

నెమ్మదిగా కళ్ళు తెరిచింది సుశీల. "రాజా! నన్ను క్షమించు. నన్ను ఒదిలిపోలేదన్న కోపంతో ఏవేవో అన్నాను. నన్ను మరిచిపో. వచ్చే జన్మలో నీ భార్యగా పుట్టించమని భగవంతుణ్ని కోరుకుంటాను" అంది సుశీల కళ్ళు మూస్తూ.

—: ఐపోయింది :—